# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 45 సంచిక :5 విజయవాడ 5-7-2012 పేజీలు : 8 వెల: రు 5.00



లోపలి పేజీల్లో...

- అమెరికా సామ్రాజ్యవాదులకు భారత పాలకుల వ్యూహాత్మకసేవ
- కూబింగ్ చర్యల పేరిట ఆదివాసీల హత్యకు సిపిఐ(ఎం-ఎల్) ఖండన
- విత్తనాలు-ఎరువులు-సాగునీరు తదితర రైతాంగ సమస్యలను తీవ్రం చేస్తున్న ప్రభుత్వ విధానాలు
- కరపత్రం: విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల ప్రాణాలతో చెలగాటం
- లండన్ ఒలంపిక్స్ నుండి భారత్ వైదొలగాలి!
- వరంగల్ : రంగాయచెరువు రిజర్వాయర్ వ్యతిరేక ఆందోళన-నిర్బంధం


## భూసేకరణ చట్టంపై వివాదంతో కాలం వెళ్లబుచ్చుతున్న పాలకులు

**త్వరితగతిన** పారిశ్రామికాభివృద్ధి సాధనకు మౌలిక సదుపాయాల కల్పన అవసరమనీ, అప్పుడు మాత్రమే విదేశీ పెట్టుబడులు వచ్చి నిరుద్యోగ సమస్య తీరుతుందని చెబుతూ దోపిడీ పాలకవర్గాలు సెజ్‌లు, రేవులు, విమానాశ్రయాలు, రోడ్లు, పరిశ్రమల కోసమంటూ భూమిసేకరణను సాగిస్తున్నారు.

అధికారమార్పిడి తర్వాత ఒకటి, రెండు దశాబ్దాలపాటు ప్రాజెక్టుల నిర్మాణం పేరిట ప్రజలను నిర్వాసితులను చేశారు. వారికి పునరావాసం మాటటుంచి నష్టపరిహారం కూడా చెల్లించలేదు. ఈ నిరంకుశత్వానికి ప్రధానంగా బలయ్యింది ఆదివాసులు. 1980లలో నిర్వాసితుల సమస్యలు ముందుకు రావటంతో 1894లో వలస పాలకుడు చేసిన భూసేకరణ చట్టానికి కొన్ని సవరణలు చేశారు. నష్టపరిహారాన్ని నిర్ధారించి, సక్రమంగా చెల్లించేందుకు కాలవ్యవధులు నిర్ణయించే స్వభావంగల సవరణలనే చేశారు.

నూతన ఆర్థిక విధానాల అమలుతో నిర్వాసితుల సమస్య తీవ్రంగా ముందుకొచ్చింది. దీనితో చట్టంలోని నిరంకుశాధికారాలనే ప్రశ్నించటం మొదలైంది. ప్రజాప్రయోజనమంటే ఎలాంటి నిర్వచనమూ ఇవ్వకుండా పాలకుడు ప్రజాప్రయోజనమని భావిస్తే చాలు, భూమిని తీసుకునే అధికారాన్ని చట్టం యిచ్చింది. ఒక ప్రైవేటు పరిశ్రమకు అతి తక్కువ ధరకు భూమి యివ్వటంలో ప్రజల ప్రయోజనమేమిటన్న ప్రశ్న ముందుకు వచ్చింది. ప్రజల సమిష్టి ప్రయోజనాల కొరకు భూమి సేకరణకు అంగీకరించవచ్చుగానీ, ప్రైవేటు లాభానికి అనుమతించబోమన్న నినాదం ప్రజలలో వచ్చింది. అలాగే నష్టపరిహారం పేరిట చేతులు దులుపుకోవటంకాక, భూమినీ ఇళ్ళనేకాక ఒక జీవన విధానాన్నే కోల్పోతున్న నిర్వాసిత ప్రజలకు సమగ్ర పునరావాసం కల్పించాలన్న డిమాండు ముందుకు వచ్చింది.

దీనితోపాటు ఏ పార్టీకి చెందినవారైనా నష్టపరిహారాన్ని పెంచుతామని ఆశపెట్టి ప్రజలను ఒప్పించేందుకు పూనుకున్నారు. ఇళ్లుకట్టి యిచ్చి, భూములు యిచ్చి పునరావాసం కల్పిస్తామంటూ వాగ్దానాలు చేశారు. పరిశ్రమలవల్ల వాటిలో ఉద్యోగాలు వచ్చి ఇప్పటికంటే మెరుగైన ఆదాయాలిచ్చే ఉపాధి అవకాశాలు పెరుగుతాయంటూ ఆశలు చూపారు. దీనితో ప్రజలలో అశాంతిని కొంత నెమ్మదింపచేశారు. చేసిన వాగ్దానాలేవీ నెరవేర్చకుండానే, భూములు తీసుకున్నారు. జీవనోపాధి కోల్పోయి, నష్టపరిహారం అందక, అందినా అరకొరగా వుండి, పునరావాసం పేరిట దూరప్రాంతాలకు తరలింపు, నివాసయోగ్యం కాని యిళ్లు, పనికిరాని బీడుభూముల కేటాయింపులతోనూ, కొద్దిపాటి కళాసీ ఉద్యోగాలుతప్ప దక్కని స్థితితో పాలకుల వంచనను ప్రజలు అనుభవాలనుండి తెలుసుకున్నారు.

దీనితో ప్రజల్లో మరింత ఆగ్రహం పెరిగింది. తెగించి తమ భూములనూ జీవనోపాధినీ రక్షించుకునేందుకు పూనుకున్నారు. భూమిని వదులుకునేది లేదంటూ తిరగబడ్డారు. దేశవ్యాపితంగా ఈ ఆందోళన సాగింది.

దీనితో పాలకులు తీవ్ర నిర్బంధానికి పూనుకున్నారు. లాఠీఛార్జీతో, తుపాకీ కాల్పులతో రక్తం పారించారు. రైతులపై పరిశ్రమాధిపతుల గూండా దాడులకు వత్తాసుగా నిలిచారు. దీనితోపాటే ప్రజలను బుజ్జగించేందుకు పూనుకున్నారు. దేశంలోకల్లా మెరుగైన పునరావాస విధానాన్ని రూపొందించి అమలు జరుపుతామంటూ ప్రకటించారు. ప్రజాభిప్రాయ సేకరణ జరిపి అనుమతిపొందిన తర్వాతే భూమి సేకరిస్తామంటూ వాగ్దానాలు చేశారు. ఆ మేరకు ఆజ్ఞలూ జారీ చేశారు. నష్టపరిహారాన్ని పెంచి దళారుల వ్యవస్థతో ప్రజలను మోసగించే విధానాన్ని అమలు జరిపారు. ప్రజాభిప్రాయసేకరణను తంతుగా మార్చి బాధిత ప్రజల గొంతు విన్పించకుండాచేసి ప్రజలు అనుమతించినట్లుగా చెప్పుకున్నారు.

దీనితో ప్రజలకు నాయకత్వం వహిస్తున్న వివిధ రకాల శక్తులను గందరగోళపరిచేందుకు, వారిని తొలగించేందుకు పాలక పార్టీల నాయకులే ఆందోళనకు నాయకత్వం వహించేందుకు పూనుకున్నారు. సమస్యను నష్టపరిహార సమస్యగా కుదించారు.

చట్టసవరణకు తోడ్పడండంటూ భ్రమలు కల్పించేందుకు పూనుకున్నారు. ప్రజాప్రయోజనమన్న పదాన్ని నిర్వచించాలి; పాఠశాలలు, రోడ్లు, ఆస్పత్రులు వంటి సమిష్టి అవసరాలు తీర్చేవాటినే ప్రజాప్రయోజనంగా పరిగణించాలి అనటం నుండి పాతబడిన భూసేకరణ చట్టాన్ని రద్దుచేయాలనేంతవరకూ సూచనలు వచ్చాయి. వీటి దృష్ట్యా పాతచట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తెస్తానంటూ కేంద్రప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. ఆ విధంగా చట్టాన్నే ప్రశ్నిస్తున్న ప్రజల అశాంతిని చల్లార్చేందుకు పూనుకుంది.

చివరకు భూసేకరణ బిల్లు 2011ను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. పార్లమెంటులో దీనిపై తీవ్ర వాదోపవాదాలు సాగాయి. ముఖ్యాంశాలేమంటే కీలకమైన ప్రజాప్రయోజనమన్న పదాన్ని కొత్తబిల్లులోనూ నిర్వచించలేదు. భూమిని సేకరించే నిరంకుశాధికారాన్నీ అట్టి పెట్టుకుంది. పార్లమెంటులో ప్రతిష్టంభన ఏర్పడటంతో బిల్లును స్థాయీసంఘం పరిశీలనకు పంపారు. 2012 మే నెలలో స్థాయీసంఘం నివేదికను పార్లమెంటుకు సమర్పించారు.

స్థాయీసంఘం చేసిన సూచనలు యిలా వున్నాయి:

ఇతర దేశాలలో భూసేకరణ పద్ధతి లేదు. ప్రైవేటు కొరకు ప్రభుత్వం భూమి సేకరించరాదు. పాఠశాలలు, ఆస్పత్రులువంటి ప్రజల ఉమ్మడి ప్రయోజనాలకొరకు మాత్రమే ప్రభుత్వం భూమిని సేకరించాలి; భూసేకరణకు గ్రామసభ ఆమోదంపొందాలి. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టుల కొరకు పంటభూములు సేకరించరాదు. ఐదేళ్లలో భూమిని చెప్పిన దానికి వినియోగించకపోతే రైతులకు తిరిగి యివ్వాలి. పునరావాస చట్టాలను రాష్ట్రాలు చేయాలి; కేంద్రం చేయరాదు. తదితరాలు వున్నాయి.

స్థాయీసంఘం సూచనలపై పార్లమెంటులో సమయం కేటాయించి చర్చించవచ్చు. స్థాయీసంఘం సూచనల్లో తనకూ అంగీకార అంశాలను తెలిపి చర్చించవచ్చు. చివరికి పార్లమెంటు నిర్ణయం ప్రకారం చట్టాన్ని చేయవచ్చు.

కానీ కేంద్ర మంత్రులే స్థాయీసంఘం సూచనలను వ్యతిరేకిస్తూ బహిరంగంగా పత్రికల కెక్కారు. ఈ సూచనలు తిరోగమన చర్యలని విరుచుకుపడ్డారు. ఇక పరిశ్రమ స్థాపనకు భూమే వుండదన్నారు. చివరకు స్థాయీసంఘం సూచనలను తిరస్కరించి మరో కొత్తబిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ సిద్ధమౌతున్నదని వార్తలు కూడా అనధికారికంగా వ్యాప్తిచేశారు.

స్థాయీసంఘం సూచనలు మౌలికంగా ప్రజలకు అనుకూలంగా వున్నాయి. అయితే అది వివాదాస్పదంగల అంశాలను కూడా పొందుపర్చింది. కేంద్రం చట్టాలను చేయటం సమాఖ్య అవగాహనకు భిన్నమనీ రాష్ట్రాల అధికారాలను కుదించేదనీ పేర్కొని మరో వివాదానికి తెరలేపింది. ఏమైనా వివాదం చేసి కొత్తచట్టం కాకుండా చేసి వీలయినంతకాలం పాతచట్టాన్నే కొనసాగించ చూస్తున్నారు.

(తరువాయి 2వ పేజీలో )

సంపాదకీయం

## 'సారా'జ్యమైన సారాజ్యం

**సారా** అమ్మకాలను ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుగా చేసుకుంది. దానిని నిరంతరం పెంచుకునేందుకు సారా అమ్మకాలను పెంచే విధానాలనే అనుసరిస్తున్నది. దీనితోపాటు ప్రజలను మత్తులో జోగేట్లు చేసి వారి చైతన్యాన్ని మొద్దుబార్చి వారిని నిర్వీర్యులను చేసే రాజకీయ లక్ష్యాన్నీ అమలుచేస్తున్నది. అందువల్లనే ప్రజల ఆర్థిక, సాంఘిక, కుటుంబ జీవనం సారావల్ల ఛిద్రమైతున్నా తన విధానాన్నే కొనసాగిస్తున్నది. దీనినుండి ప్రజలలో ఆందోళన పెరిగినప్పుడు కమిటీలు, పరిశీలనలు అంటూ హడావుడి చేసి నూతన విధానం పేరిట గత విధానాలనే అమలు జరుపుతున్నది.

సారా అమ్మకాలు ముఖ్య ఆదాయ వనరు కావటంతో ఈ వ్యాపారంలోకి కాంట్రాక్టర్లు పుట్టుకొచ్చారు. ప్రభుత్వం తరఫున అమ్మకాలు సాగించి తమ కమీషన్ పుచ్చుకుని వ్యవహరించవలసిన వీరు రాజకీయ నేతల అండదండలతోనూ, అవినీతిమయ అధికార గణాలతోనూ కలిసి బలీయవర్గంగా తయారయ్యారు. వీరే ప్రత్యక్షంగా రాజకీయరంగంలోకి ప్రవేశించటంతో ప్రధాన లాబీగా తయారైంది. సారా అమ్మకాలద్వారా ప్రభుత్వానికెంత ఆదాయం వస్తున్నదో దాదాపుగా అంత ఆదాయాన్ని ఈ లాబీ పొందుతున్నది. మొత్తం సారా వ్యాపారాన్నే రెండు, మూడు సిండికేట్లు తమ ఆధీనంలో వుంచుకోవటంతో ఇవి రాజకీయ పార్టీలలో ముఠా తగవులకు కూడా కేంద్రమయ్యాయి.

ఈ నేపథ్యంలోనే ఇటీవల కల్తీసారా తాగి మరణాలు సంభవించటంతో ప్రజలలో ఆందోళన వచ్చింది. దీనితో తప్పనిసరై పాలకులు సారా సిండికేట్లపై ఏసిబి దాడులు నిర్వహించారు. దీనితో సారాజ్యాల పట్టు అన్నిరంగాలలోకి విస్తరించిన బహిరంగ రహస్యం బ్రద్దలయింది. కులాలు, ప్రాంతాల నడ్డుపెట్టుకుని సారా దోపిడీని కప్పిపుచ్చుతూ కాంగ్రెసులో ముఠా తగవులు రచ్చకెక్కాయి. చివరికి అధిష్టానం రాజీ కుదర్చటంతో ముఠాలు సర్దుకుని ప్రజావంచనకు పూనుకున్నాయి.

నూతన మద్య విధానాన్ని రూపొందించి సారాజుల ఆట కట్టిస్తానని ప్రభుత్వం ప్రకటించింది. దీనికోసం మంత్రివర్గ సబ్‌కమిటీని వేసింది. ఇది ఇతర రాష్ట్రాలలో పర్యటించి వచ్చి తన నివేదిక నిచ్చింది. నూతన విధానమంటూ ఒక దానిని ప్రకటించింది.

షాపుల వేలం పాట బదులు లాటరీ పద్ధతిలో కేటాయించటం, జనాభా ప్రాతిపదికన ప్రతిషాపుకూ లైసెన్సు ఫీజు నిర్ధారించటం అన్నదే గత విధానంలో చేసిన మార్పులు. దీనివల్ల ప్రభుత్వం తన ఆదాయాన్ని కోల్పోవటానికి కూడా సిద్ధపడిందనీ, సారాజుల దోపిడీకి అడ్డుకట్టపడుతుందనీ చెప్పుకుంది.

దీనిప్రకారం మొత్తం 5703 షాపులను లాటరీ పద్ధతిలో కేటాయించగా రూ॥2617 కోట్లు లైసెన్సు ఫీజుగా వచ్చింది. దరఖాస్తుల ద్వారా మరో రూ॥170 కోట్లు వచ్చాయి. మరో 893 షాపులకు ఎవరూ దరఖాస్తు వేయనందున కేటాయించలేదు. సగటున ప్రతి షాపుమీదా 45 లక్షలకు పైగా ఫీజువచ్చింది. మిగిలిపోయిన షాపులు కూడా అన్నిరకాల ప్రాంతాలలో వున్నందున ఇదే సగటు రేటున మరో రూ॥500 కోట్లు, దరఖాస్తులద్వారా మరో వంద కోట్లు కనీసంగా వస్తాయి. అంటే రూ॥3300 కోట్లు. దాదాపుగా గత ఏడాది ఫీజు ఆదాయానికి(రూ.3500 కోట్లు) సమానం. రెస్టురూంల పేరిట షాపులలోనే ఎక్కువ తాగించేందుకు ఒక్కో షాపునుండీ లక్ష రూపాయలు; బార్ల లైసెన్సు ఫీజుల పేరిట వచ్చే కోట్లాది ఆదాయమంతా అదనమే. ప్రతి షాపుకీ లైసెన్సు ఫీజు నిర్ధారించటంతో, మొత్తం లైసెన్సు ఫీజు ఎంత వస్తుందో లెక్కవేయగలిగి కూడా రూ.2500 కోట్లే వస్తుందని పచ్చి అబద్ధం ఆడటానికి ప్రభుత్వం పూనుకోవటం తన వంచనను కప్పి పుచ్చుకొనటానికే.

లాటరీ విధానంలో షాపులు పొందేందుకు ఒక్కరే అనేక దరఖాస్తులు పెట్టి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. నల్గొండజిల్లాలో సిండికేట్లు దరఖాస్తు ఫీజుకోసం కోటిరూపాయలు ఖర్చుచేశాయి. నిజామాబాద్ జిల్లాలో 8 మంది కలిసి షాపులకు భార్య, కూతుళ్లు, కొడుకుల పేర్ల దరఖాస్తులు వేశారు. లాటరీ తీసే కార్యక్రమానికి పిల్లలను చంకనేసుకుని మహిళలు తరలిరావటమే దీనిని తెలుపుతున్నది.

ఇక జరగబోయేదేమిటో తెలిసిందే. ప్రభుత్వం మానివేసిన వేలంపాటను సిండికేట్లు నిర్వహిస్తాయి. లాటరీలో షాపు పొందిన వ్యక్తులనుండి నయానా భయానా షాపును పొందుతాయి. ఇక మళ్లీ సారాజ్యం యథావిధిగా సాగుతుంది. సారా ఏరులై పారుతుంది. లైసెన్స్ ఫీజు, ఎక్సైజు సుంకం, అమ్మకంపన్ను, సర్వీసుటాక్సులు పెరిగి ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. లైసెన్సు, దొంగవ్యాపారాలు రెండూ జమిలిగా సాగించి సారాజుల ఆదాయమూ పెరుగుతుంది. అధికారగణాలకూ, నేతలకూ ఎవరివాటాలు వారికి ముడతాయి. 'ప్రజల ఆగ్రహాన్ని మళ్లించే ప్రభుత్వమే సారా దుకాణాలు నడపాలి, ఎంఆర్‌పి రేటుకే మద్యం అమ్మాలి' వంటి చిట్కా పరిష్కారాలన్నీ కడుపు చల్లగా నిద్రపోతాయి.

1992లో తీవ్రస్థాయిలో సారా వ్యతిరేక ఉద్యమంతో అమలు జరిపిన మద్య నిషేధంతో ప్రజల నిత్యావసరాలు తీర్చే వ్యాపారాలు పెరిగిన అనుభవం, ప్రజల ఆరోగ్య సమస్యలు తగ్గిన, కుటుంబ కలహాలు తగ్గిన అనుభవాలనుండి పాలకులు నేర్చుకున్నదేమీ లేకపోగా, దానినెప్పుడు ఎత్తివేద్దామా అని ఎదురుచూస్తూ కూర్చున్నారు. దొంగ సారా, వారి కనుసన్నల్లోనే సాగింది. సారా ఆదాయం లేక ప్రజాహిత చర్యలు చేపట్టలేక పోతున్నామంటూ కిలో రూపాయి బియ్యం పథకానికి

(తరువాయి 2వ పేజీలో)

# కూంబింగ్ చర్యలపేరిట ఆదివాసీల క్రూరహత్యను ఖండించండి!

**ఛత్తీస్‌ఘడ్** రాష్ట్రం-బిజనూర్ జిల్లా-సర్కెగూడా గ్రామంలో జరిగిన, 'ఎదురుకాల్పులు'గా చెప్పబడుతున్న సంఘటనలో 18 మంది ఆదివాసీలు మరణించారు. పోలీసుల ప్రకటనకు విరుద్ధంగా జాతీయ మాధ్యమాలలో వెలువడిన వార్తలద్వారా చనిపోయిన వారంతా మావోయిస్టులు కాదని తెలుస్తున్నది. ఆదివాసులు తమ సాంప్రదాయక పండుగను నిర్వహించుకునేందుకో లేక భూవివాదాన్ని గురించి చర్చించుకునేందుకో గ్రామంలోని అందరూ జమగూడి మాట్లాడుకునే సమావేశంపై కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు(సిఆర్‌పిఎఫ్) జరిపిన కాల్పులలో అమాయక ఆదివాసీ పురుషులు, స్త్రీలు ఇంకా పిల్లలు కూడా ప్రాణాలు పోగొట్టుకున్నారు. చనిపోయిన వారిలో అత్యధికులు సాధారణ పౌరదుస్తులతోవుండటం ఫోటోలలో స్పష్టంగా కన్పడుతున్నది. "పోలీసులు చేపట్టిన ఒక 'చర్య'లో వాస్తవికంగా రెండువైపులా మరణాలున్న సందర్భాలలోనూ పోలీసులను కాపాడేందుకు న్యాయపరమైన చట్రాలు పూర్తిగా లేకపోవటం అనేది, పరస్పర కాల్పులలో చనిపోయిన వారంతా మావోయిస్టులేనని ప్రకటించేందుకు పోలీసులను నెడ్తున్నద'ని పేరు ప్రకటించని ఒక పోలీసు అధికారి క్షమాపణా పూర్వపు సంజాయిషీనివ్వటమే, ఇది పూర్తిగా బూటకపు ఎదురుకాల్పులని స్పష్టంచేస్తున్నది.

కూంబింగ్ చర్యల పేరిట ఆదివాసీల క్రూరహత్యలను సిపిఐ(ఎం.ఎల్) కేంద్రకమిటి తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రజాఉద్యమాలను అణచివేయటానికి అధికార వర్గాలు గతంలో విస్తృతంగా అమలుచేసిన 'దండనా చర్యలు'గా పిలవబడేవి పునరావృతం కావటం మినహా ఇది మరోటి కాదు.

ఈ సామూహిక ఘాతుక హత్యాకాండకు బాధ్యులైన వారిని గుర్తించి, శిక్షించేందుకు ఉన్నతస్థాయి న్యాయవిచారణ జరిపించాలని సిపిఐ(ఎం.ఎల్) కేంద్రకమిటి డిమాండ్ చేస్తున్నది.

**విశ్వం**

**30-6-2012**

ప్రధాన కార్యదర్శి

సిపిఐ(ఎం.ఎల్) కేంద్రకమిటి

# లక్షింపేట దళితన్నల బలిదానం ఆదేశిస్తున్నకర్తవ్యం

**"రెండు** మూడు శాల్తీలు లేస్తేగానీ మీరు భూములు వదలర్రా"... లక్షింపేట దళితులను క్రూరంగా చంపుతూ పెత్తందార్లు వాడిన మాట ఇది. భూమితో జీవితం, భూమితో ఆత్మగౌరవం అనుకొంటూ దొరికిన ఆ 60ఎకరాలనే తమ మధ్య పంచుకొని సాగుచేసుకొంటూ సాగుతున్న లక్షింపేట దళితుల జీవన పోరాటానికి సూదిమోపినంత స్థలం కూడా ఇవ్వనన్న దుర్యోధనుని అహంకారపు భూస్వామ్య విధానం అడ్డుగోడగా నిలబడిన తీరును ఇది తెలియచేస్తుంది. రాజ్యం అన్నది ధృతరాష్ట్రునిగా కళ్ళకు గుడ్డలు కట్టుకొని గుడ్డితనాన్ని నటిస్తూ, ఇలాంటి మారణకాండల సమయంలోనే అపుడే తెలివి వచ్చినట్లు కనపడుతూ, భూస్వామ్య-పెత్తందార్లనే ఎలా కాపాడుతూ వస్తుందో ఇక్కడ కనపడుతోంది. ప్రాణాలకు డబ్బులతో వెల కట్టాలన్న నాటకం, అసలు మౌలిక సమస్య అయిన భూమిగురించి ఏ మాటా మాట్లాడని కపటత్వం... ఇది ప్రభుత్వ కుటిల నీతికి మచ్చుతునక!

ఈ 60 సంవత్సరాల "స్వతంత్ర" దేశంలో అడుగడుగునా బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలున్న దేశంలో, దళితులు యం.ఎల్.ఏ.లు, మంత్రులుగా రాజ్యమేలుతున్న దేశంలో సగటు దళితుల జీవితం భూమికి దూరంగా వ్యవసాయకూలీలుగా, వలస కూలీలుగా వెళ్ళమారుస్తున్న పరిస్థితే ఉత్తరాంధ్ర పరిస్థితికూడా. రాష్ట్రంలో ప్రతి అయిదుగురిలో ఒకరు రైతుకూలి. ఆ రైతుకూలీలలో అత్యధికులు దళిత, గిరిజనులే. 'భూసంస్కరణలు', 'భూ పంపకాలు', 'సస్యవిప్లవాలు' భూస్వామ్య దోపిడీనే బలీయం చేస్తున్నాయని దళితులపై దిగిన బరిశెల పోట్లే సాక్ష్యమిస్తున్నాయి.

భూమి సమస్యని ఎంత కనుమరుగు చేద్దామన్నా, "భూమిలో ఏముందిరా" అంటూ ఎంత నీరసపరుద్దామన్నా, 'భూమి సమస్యని వ్యవసాయక విప్లవానికి ఇరుస'న్న వాదనను ఎంత అపహాస్యం చేద్దామన్నా సాధ్యం కావటంలేదు. అలలు అలలుగా, తెరలు తెరలుగా భూపోరాటాలు, భూమి కేంద్రంగా ఉద్యమాలు సాగుతూనే వున్నాయి. కోస్తా జిల్లాలలో కౌలురైతుల ఆత్మహత్యలన్నీ భూకేంద్రీకరణ విష ఫలితాలే.

చివరిగా ప్రముఖ మార్క్సిస్టు - లెనినిస్టు కా॥ తరిమెల నాగిరెడ్డి తన ప్రఖ్యాత **"తాకట్టులో భారతదేశం"**లో 'తెగించిన ఆగ్రహం అనివార్యం' అంటూ చెప్పిన మాటలను గుర్తుచేసుకుందాం.

*"భారతదేశ ఆర్థికవ్యవస్థ ప్రధానంగా అర్థఫ్యూడల్-అర్థవలస స్వభావాన్ని కలిగివుంది. ఈ కాలమంతటి లోనూ ఈ స్వభావంలో ప్రాథమికమైన ఎలాంటి మార్పు సంభవించక పోవటమే సమాజంలో కులవ్యవస్థ అలాగే నిలిచి వుండటానికి కారణమైంది. సరుకుల ఉత్పత్తితో కూడిన ఆర్థిక వ్యవస్థలో సంపదల తారతమ్యాలు సైతం కులవ్యవస్థను మరింత తీవ్రంచేస్తాయి".*

*"అందువల్ల అణగద్రొక్కబడిన వారి తిరుగుబాటు వర్గస్వభావం కొన్ని సందర్భాలలో కొన్ని కులాల రూపంలో వ్యక్తమయినంతమాత్రాన, అట్టడుగు పీడితవర్గాల అణచివేత కొన్ని పీడిత కులాలపై క్రూరమైన యుద్ధరూపం తీసుకున్నంత మాత్రాన వర్గపోరాటంయొక్క మౌలిక స్వభావాన్ని ఎంత మాత్రమూ మరుగుపరచజాలవు."*

**(తాకట్టులో భారతదేశం పేజి: 420,421)**

లక్షింపేటలో మన దళిత సోదరుల బలిదానం వృధాకానీయకుండా, భూపోరాటాలను కడదాకా కొనిపోయేందుకు పూనిక వహించాలి. ★

**కాంతి కేంద్రాలా! మృత్యు మందిరాలా ?**

**పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర, సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ**

**ఓ. పి. డి. ఆర్. అధ్యయన బృందం నివేదిక**

**వెల: రు. 15/-**

**మైత్రి బుక్ హౌస్ 28-9-1, జలీల్ వీధి, ఏలూరురోడ్, విజయవాడ**

జనశక్తి ప్రచురణ

**ఆంధ్రప్రదేశ్ విభజన కమ్యూనిస్టు విప్లవకారుల వైఖరి**

**కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, విశ్వం తదితరుల వ్యాస సంకలనం**

వెల: రు. 15/-

**కాపీలకు: మైత్రీ బుక్ హౌస్**

**జలీల్ వీధి, అరండల్‌పేట, విజయవాడ**



# కా॥ తామాడ పోలమ్మకు జోహార్లు

**శ్రీకాకుళ** గిరిజన రైతాంగ ఉద్యమంలో 1969 నవంబర్ 22న అమరులైన కామ్రేడ్ తామాడ గణపతి భార్య పోలమ్మ 21-6-12న బొడ్డపాడులో కన్నుమూశారు. కా॥ పోలమ్మకు **'జనశక్తి'** నివాళులర్పిస్తున్నది.

కా॥ గణపతితో వివాహమైన తదనంతర కాలంలో, కా॥ గణపతి అమరుడైన గత 43 సం॥ల కాలంగానూ కా॥ పోలమ్మ విప్లవోద్యమ సానుభూతిపరురాలిగా, విప్లవోద్యమ కార్యకర్తలను ఎల్లవేళలా ఆదరించేవారుగా ఉన్నారు. తామాడ గణపతిని హత్యచేసిన ప్రభుత్వం, తనపై సానుభూతి చూపి, భూమి ఇవ్వజూపటాన్ని నిర్ద్వంద్వంగా ఆమె తిరస్కరించారు. ఆమె కడవరకూ బొడ్డపాడు ప్రాంత ప్రజలతోనే కలగలసి జీవించారు. వీరికి త్రిలోచన్, అరుణ-ఇద్దరు సంతానం. జూలై 1న బొడ్డపాడులో జరిగిన కా॥ పోలమ్మ సంస్మరణ సభలో ఇతర పార్టీల ప్రతినిధులతోపాటు సిపిఐ(ఎం.ఎల్) శ్రీకాకుళంజిల్లా నాయకురాలు కా॥అరుణపాల్గొని నివాళలర్పించారు.

కా॥ పోలమ్మ మృతిపట్ల **'జనశక్తి'** సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియపరుస్తున్నది.

# కా॥ నూతక్కి సుబ్బారావుకి విప్లవ జోహార్లు

2012 జూన్ 7వ తేదీన కృష్ణాజిల్లా వేల్పూరు గ్రామంలో, సీనియర్ కామ్రేడ్ నూతక్కి సుబ్బారావు(75) అనారోగ్యంతో మరణించారు. ఆర్‌టిసి ఉద్యోగిగా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చురుకుగా పనిచేశారు. 1968లో పార్టీ చీలిన దశలో కా॥టియన్ నాయకత్వాన గల విప్లవ కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలను ధృడంగా నమ్మి ఆర్‌టిసి కార్మికోద్యమంలో విప్లవరాజకీయ కార్యక్రమాలు చేపట్టికొనసాగించే కృషిలో చురుగ్గా పాల్గొన్నారు. ఆర్‌టిసిలో రిటైర్ అయిన తర్వాత కూడా పార్టీతో సన్నిహిత సంబంధాలు కల్గివుంటూ పార్టీకి అన్నివిధాలా సహకరిస్తూ వచ్చారు.

కా॥ సుబ్బారావుకి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. వారికి విజయవాడ నగర పార్టీ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కా॥ సుబ్బారావుకి విప్లవ జోహార్లర్పిస్తున్నది.

# 4-7-12 ఉదయం 11 గంటలకు జిల్లాకలెక్టరేట్లవద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలను జయప్రదంచేయండి

*'ప్రభుత్వ భూమిని దళితులు దున్నుకుంటామంటే 'పంచ' ప్రాణాలు తీస్తారా? అసలు ముద్దాయిలను అరెస్టు చెయ్యరా? భూమి గురించి ఎంతకాలం ఈ దాడులు? అడగండి, ప్రభుత్వాన్ని నిలదీయండి! హామీ ఇవ్వరా?'* అని ప్రశ్నిస్తూ, 'లక్షింపేట పోరాట సంఘీభావకమిటి' **జులై 4న 'ఛలో కలెక్టరేట్'** పిలుపునిచ్చింది. రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)తో సహా పలు దళిత, మహిళా, ప్రజాసంఘాలు భాగస్వామ్య సంస్థలుగా వున్న ఈ పోరాట సంఘీభావ కమిటీకి బొజ్జా తారకంగారు కన్వీనర్‌గా వున్నారు.

ఈ సందర్భంగా సంఘీభావకమిటి ప్రచురించిన కరపత్రంలో 'లక్షింపేట మాలల్ని హతమార్చిన వారిని వెంటనే అరెస్టు చేయాలి. లక్షింపేటలోనే స్పెషల్‌కోర్టు పెట్టాలి. దాడి జరిగిన ముప్ఫయి రోజుల్లో ఛార్జిషీటు వేసి కేసు విచారణ మొదలుపెట్టాలి. ఎక్కడైతే మాలల రక్తంచిందిందో ఆ రక్తం, ఆ మట్టి సాక్షిగా అక్కడే కేసు విచారణ జరగాలి; ఏమాత్రం ఆలస్యం లేకుండా కేసు విచారణ పూర్తికావాలి; శిక్షలు పడాలి. ఈ లోపున ప్రాజెక్టు మిగులు భూమి 250 ఎకరాలను దళితులకు కేటాయించాలి' అని డిమాండ్ చేశారు.

'దున్నేవాడికే భూమి' నినాదంతో భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన వీరోచిత తెలంగాణా రైతాంగసాయుధపోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అమరుడైంది-జులై 4వ తేదీననే! ఈ స్ఫూర్తినందుకుందాం.

**విజయవాడ,** **యస్. ఝాన్సి** **కె. కోటయ్య**

**30-6-12** **అధ్యక్షులు** **కార్యదర్శి**

**రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)**

**భూసేకరణ...** (మొదటి పేజీ తరువాయి)

మరొక కోణంనుండి ప్రజల అశాంతి "అదుపు" తప్పి శాసనబద్ధ పాలననే ప్రశ్నించే దిశగా సాగుతున్న పరిణామాన్ని గమనించిన పాలకవర్గాలు, వారి రాజకీయ ప్రతినిధులూ ప్రజలలో భ్రమలు కల్పించి తిరిగి చట్టపరిధిలోకి వారిని తెచ్చేందుకు కూడబలుక్కుని ఆడుతున్న నాటకమిది.

పాలకుల ఈ వంచనను ప్రజలముందు బహిర్గతం చేయాలి.

- 1894 భూసేకరణ చట్టాన్ని రద్దుచేయాలి.
- ప్రైవేటు పెట్టుబడి అవసరాలకు ప్రభుత్వం భూసేకరణ చేయరాదు.
- ప్రజల సమిష్టి ప్రయోజనాల కొరకు మాత్రమే, ప్రజల అనుమతిపొంది భూమి తీసుకోవాలి.
- భూమి అవసరమైన ప్రైవేటు శక్తులు భూహక్కుదారు అనుమతితో తామే భూమి కొనుగోలు చేసుకోవాలి.
- సమిష్టి ప్రయోజనాలకొరకు ప్రభుత్వం భూసేకరణకు పూనుకున్నప్పుడు ప్రజలు ఆమోదించిన సమగ్ర పునరావాస పథకాన్ని అమలుజరిపిన తర్వాతే భూమి సేకరణకు పూనుకోవాలి.
- ఎట్టి పరిస్థితిలోనూ విదేశీ పెట్టుబడిదారులకు భూమి పొందే హక్కు అనుమతించరాదు.

పై డిమాండ్లతో ప్రజలను సమైక్య పోరాటాలలోకి సమీకరించాలి. ★

**సంపాదకీయం...** (మొదటి పేజీ తరువాయి)

తూట్లు పొడిచిందివారే. లక్షాపాతిక వేలకోట్లతో బడ్జెట్టు ప్రవేశపెట్టామని భుజాలు చరచుకున్న వారే సారా ఆదాయం 15వేల కోట్లు లేకపోతే బడ్జెట్ నడవనట్లు పేద అరుపుల హోరు సాగిస్తున్నారు. ప్రజలను మద్యం బానిసలను చేసి, మద్యం వ్యసనాన్నుండి వెంటనే బయటపడలేమంటూ సాకులు చెబుతున్నది. ప్రజలకు మద్యం అలవాటుచేసి, వారి ఆదాయాలతో ఖజానా నింపుకుని, దోపిడీ వర్గాల జేబులు నింపే లక్ష్యంతోనే పాలకులున్నారనీ, దీనిని కప్పిపుచ్చుకునేందుకే కొత్త విధానాలంటూ వంచన చేస్తున్నారు.

పాలకవర్గాలు సాగిస్తున్న ఈ వంచనను ప్రజలచే గుర్తింపచేయాలి. ప్రజల అస్తుబిస్తు ఆదాయాలను కొల్లగొడుతున్న, సాంస్కృతిక జీవనాన్ని కాలుష్యపరుస్తున్న, కుటుంబ జీవనాన్ని ఛిద్రంచేస్తున్న ప్రభుత్వ మద్యం విధానాన్ని వ్యతిరేకించాలి. మద్యం ఉత్పత్తి విక్రయాల సంపూర్ణ రద్దును డిమాండ్‌చేస్తూ బలమైన ప్రజాఉద్యమం మాత్రమే ప్రజల ప్రయోజనాలను కాపాడగలుగుతుంది. ★

# అమెరికా సామ్రాజ్యవాదులకు భారత పాలకుల వ్యూహాత్మక సేవ

**మే** నెల చివరిలో భారత పర్యటనకు అమెరికా విదేశాంగ మంత్రిణి హిల్లరీ క్లింటన్ వచ్చింది. ఇరాన్ విధించిన ఆంక్షలను పాటించాలని భారత్‌పై వత్తిడి తెచ్చారు. దానికి తలవంచిన భారత ప్రభుత్వం ఇరాన్ నుండి చమురు దిగుమతులు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. తిరిగి వెళ్లిన క్లింటన్ భారత్ పై ఆంక్షల విధింపును 180 రోజులపాటు ఆపింది.

జూన్ మొదటివారంలో అమెరికా రక్షణ మంత్రి పన్నేట్టా ఢిల్లీ వచ్చారు. భారత ప్రభుత్వంతో చర్చించారు. ఆఫ్ఘనిస్తాన్ భద్రతా దళాలకు శిక్షణనిచ్చే కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తామనీ, ఆఫ్ఘనిస్తాన్‌కు యుద్ధట్యాంకులు, సాయుధ శకటాలను సరఫరా చేస్తామనీ, ఆఫ్ఘనిస్తాన్ పునర్నిర్మాణ కార్యక్రమమనే దానికి నిధుల కేటాయింపు పెంచుతామనీ భారత ప్రభుత్వాన్ని అంగీకరింపచేసి వెళ్ళాడు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో పునఃసమతుల్యత స్థాపనలో భారత్‌కు "ఇరుసు సీల" పాత్ర వుంటుందని ప్రకటించి వెళ్లాడు.

ఇది జరిగిన వారం రోజులకు భారత విదేశాంగ మంత్రి ఎస్.ఎం. కృష్ణ అమెరికా వెళ్లాడు. అమెరికా వ్యూహాత్మక సంభాషణల మూడవ విడతలో పాల్గొన్నాడు. కేంద్ర మంత్రి కపిల్ సిబాల్, ప్రధాని సలహాదారు సామ్ పిట్రొడా కూడా ఆయనతో వున్నారు. ఆరోగ్యం, విద్య, మహిళా సమస్య, శాస్త్ర–సాంకేతిక రంగం, సైబర్ భద్రత, టెర్రరిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో సహకారం గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఇక్కడ మొత్తంగా 23 అంశాలు చర్చించారు. వీటిని గురించి మాట్లాడటం మాత్రమే సరిపోదని, "ద్వైపాక్షిక పెట్టుబడులు ఒప్పందంపై ముందుకు సాగాలనీ, రిటైల్ వ్యాపారంలో వాణిజ్య, పెట్టుబడులకున్న అడ్డంకులను మరింత తగ్గించటానికీ, మా ప్రతి ఒక్క కంపెనీ వ్యాపారం చేయటానికి ఆతిధ్య వాతావరణం ఏర్పాటుకూ" కృషి చేయాలని హిల్లరీ క్లింటన్ కోరింది. ఆమె నిర్ణయించిన అజండానే సమావేశం చర్చించింది. ఈ సంభాషణల్లో నిర్ణయాలేమీ జరగవు గానీ చేయాల్సిన నిర్ణయాల స్వరూపస్వభావాలెలా వుండాలో చర్చించి అంగీకారానికి వస్తారు.

విద్యారంగంలో అమెరికా విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ దుకాణాలు తెరవటానికి ఇప్పటికే కుదిరిన ఒప్పందాన్ని ముందుకు తీసుకుపోయేందుకూ, రిటైలు వ్యాపారంలోకి అమెరికా కంపెనీల ప్రవేశాన్ని త్వరితం చేసే చర్యల గురించీ ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. దొడ్డిదారి ప్రవేశాలు కాక, పూర్తి ప్రవేశాలతో రిటైలు రంగాన్ని అప్పగించాలని అమెరికా కోరుతున్నది. భారత్‌పై అమెరికా పట్టునూ, దోపిడీనీ పెంచే ఈ నిర్ణయాలు తీవ్రత విస్మరించరానిది.

అణువిద్యుదుత్పత్తి రంగం సమస్య భారత పాలకులకు కొరకరాని కొయ్యగా వుంది. అమెరికా కోరిన విధంగా చేయాలని భారత ప్రభుత్వం చూస్తుండగా, ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. అణువిద్యుత్తు ప్లాంట్లలో ప్రమాదం జరిగితే నష్టపరిహార బాధ్యత అమెరికా కంపెనీలకు ఏమాత్రం ఉండరాదని అమెరికా పట్టుపడుతుండగా, తప్పని సరై కొంత బాధ్యత వహించాలని భారత ప్రభుత్వ వాదన. ఈ అంశం తేలే వరకూ అణుప్లాంటుల నిర్మాణం ప్రారంభంచలేమని అమెరికా బిగబట్టింది. ఈ నేపథ్యంలో గుజరాతులో నిర్మించే అణుప్లాంటుపై భారత అణు విద్యుత్తు సంస్థకూ, అమెరికా కంపెనీ వెస్టింగ్ హౌస్‌కూ మధ్య కుదరాల్సిన ఒప్పందంపై నిర్దిష్టంగా చర్చలు జరిగి కొంత పురోగతి సాధించినట్లు పత్రికా వార్తలు తెలుపుతున్నాయి. ఇక్కడ పురోగతి అంటే అమెరికాకు ఎంతో కొంత రాయితీ యివ్వటమే. ఇరాను చమురు దిగుమతులు చేసుకున్నందున ఆంక్షలు విధిస్తామన్న బెదిరింపులతో భారత్‌ను అమెరికా లొంగదీసుకుంటున్నది.

ఈ వ్యూహాత్మక సంభాషణల్లో అన్నాళ్లూ వ్యూహాత్మక విషయాలు చర్చకు రాలేదనీ, అయితే మూడవ విడతలో ఈ అంశాలు ఒక అమెరికా రాజకీయ వ్యాఖ్యాత అన్నట్లుగా ఇవి దాదాపుగా గుట్టుగా, చర్చకు వచ్చినందున దీనికి ప్రాధాన్యత వచ్చింది.

పసిఫిక్, హిందూ మహాసముద్రాలనూ, వీటి తీరాన వున్న ఆసియా పసిఫిక్ దేశాలనూ వ్యూహాత్మకంగా కీలకమైనదిగా అమెరికా పరిగణిస్తున్నది. దానికున్న 11 అణుచోదిత యుద్ధవిమాన వాహకనౌకలలో 6ఈ ప్రాంతం లోనే నిలిపివుంచింది. వీటిలో మొత్తం 100 యుద్ధనౌక లున్నాయి. వీటిని 110కి పెంచబోతున్నది. అయితే ఇవి తమస్వదేశానికి చాలాదూరంగా పనిచేస్తున్నాయి.

కాగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చైనాకు 86 యుద్ధ నౌకలున్నాయి. 2020 నాటికి వాటిని 106కు పెంచబోతున్నది. ఇవి స్వదేశానికి దగ్గరగా వున్నందున త్వరితంగా కదలగలుగుతాయి. ఈ కారణం రీత్యానే ఈ ప్రాంత దేశాలు అమెరికా అనుకూలంగా వున్నా చైనాకు కోపం తెప్పించేందుకు సిద్ధంగాలేవు. చైనా బలాన్ని ఎదుర్కొనేందుకు రూపొందిన సైనిక ప్రణాళికనే అమెరికా "ఆసియా పసిఫిక్ ప్రాంతంలో పునఃసమతుల్య స్థాపన" అంటున్నది.

ఈ ప్రణాళికలోకి భారత నౌకా దళాన్ని లాగాలన్నదే అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయత్నం. తక్కువ సంఖ్య సైనికులు, చురుకు కదలిక, అత్యాధునిక ఆయుధ పరిజ్ఞానంతో పైచేయిలతో ప్రపంచంలో ఎక్కడైనా దాడి చేయగలిగే స్థితిని పొందటం ఈ ప్రణాళిక లక్ష్యమని అమెరికా చెప్పింది. హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న అమెరికా వాణిజ్య నౌకలకు భారత నావికాదళం రక్షణ కల్పిస్తుందని ఇప్పటికి భారత ప్రభుత్వం అంగీకరించింది. మరింత భారత్‌ను ఆకర్షించేందుకు అత్యాధునిక యుద్ధ విమానాలు అందజేస్తాననీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇస్తాననీ ఆశలు పెడుతున్నది. సముద్ర జలాలపై కన్నువేసి వుంచే విమానాలైన పి8–ఐ లను వినియోగిస్తున్నది అమెరికా, భారత్‌లేనని కనుక తాము చూపుతున్న ఆశలు వట్టి మాటలు కాదనీ చెబుతున్నది. తన సైనిక వ్యూహంలో భారత్‌ను 'ఇరుసు సీల'గా చేయాలన్న దిశగా అమెరికా ప్రయత్నాలు సాగుతున్నాయి.

పన్నెట్టా ఢిల్లీలో ఉన్న సమయానికి ఎస్.ఎం. కృష్ణ బీజింగ్‌లోవున్నాడు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెంపుదల లక్ష్యంగా చర్చలు జరిగాయని భారత్ ప్రకటించింది. చైనా నుండి భారత్‌కు ప్రమాదం పొంచి వుందన్న అంశాన్నీ, చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను ముందు పెట్టేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నదన్న అంశాన్నీ కృష్ణ తేలిగ్గా కొట్టివేశారు. హిందూ మహాసముద్రం శాంతి మండలంగా వుండాలని భారత్, అమెరికాలు కోరుకుంటున్నట్లుగానే చైనాకూడా కోరుకుంటున్నదనీ ముగ్గురం కలిసికట్టుగా వ్యవహరించాల్సిన అవసరముందని అన్నాడు. శాంతి మండలంగా వుండాలని కోరుకుంటున్నవారు పోటీపడి హిందూ మహాసముద్రాన్ని యుద్ధ నౌకలతో నింపుతున్నారెందుకన్నది ప్రశ్న. సామ్రాజ్యవాదం, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచాధిపత్యం కోసమే ఈ చర్యకు పూనుకున్నదన్నది స్పష్టమే.

అమెరికా చూపుతున్న ఆశలకు లోబడి భారత ప్రభుత్వం అమెరికాసైనిక వ్యూహంలో భాగస్తురాలవుతుందా? భారత ప్రభుత్వమూ, రాజకీయ పార్టీలు, వారి యజమానులైన దోపిడీ పాలక వర్గాల 65 ఏళ్ళ పాలనను గమనించిన వారెవరికైనా అలా లొంగి పోతుందన్న విషయంలో సందేహం ఏర్పడదు. బలమైన ప్రజాందోళన మాత్రమే పాలకులకు అడ్డుకట్టవేయగలదు. కనుకనే ప్రజలు, ప్రజాతంత్రవాదులూ, దేశభక్తులూ దీనిని వ్యతిరేకించాలి. పొరుగు దేశాలతో స్నేహ సంబంధాలను నెలకొల్పుకొని దక్షిణాసియాలో శాంతి నెలకొనే స్వతంత్ర విధానాలనుసరించాలని డిమాండు చేయాలి. ✶

---

కరపత్రం

# విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న స్వదేశీ, విదేశీ కాంట్రాక్ట్ కంపెనీల 'టర్న్‌కీ' ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలి! పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రైవేటీకరణ వైపు అడుగులు వేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం!

*కార్మిక సోదరులారా! ప్రజలారా!!*

ఈనెల 13వ తేదీన మనదేశ ఉక్కు కర్మాగారాల చరిత్రలోనే అతి ఘోరమైన దుర్ఘటనగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ జరిగిన దుర్ఘటన భద్రతా ప్రమాణాల డొల్లతనాన్ని వెక్కిరిస్తూ 19 మంది ఉద్యోగుల జీవితాలను బలిగొంది. దుర్ఘటనలో తమ విలువైన ప్రాణాలను కోల్పోయిన సోదరులకు ఎ.ఐ.ఎఫ్.టి.యు (న్యూ) నివాళులర్పిస్తున్నది. వారి కుటుంబాలకు తన సానుభూతిని తెలియజేస్తున్నది. ప్రమాదం జరిగిన అనంతరం కేంద్ర ఉక్కుగనుల శాఖామంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంకా అనేక మంది అధికార ప్రతిపక్ష నేతలంతా హుటాహుటిన వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. నెలరోజుల్లో దర్యాప్తు నివేదిక తెప్పించి, ప్రమాద కారణాలను వెలికితీసి, మృతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చి వెళ్లారు. చనిపోయిన వారి కుటుంబాలకు కోటిరూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని విపక్షాలు డిమాండ్ చేసాయి.

**ప్రమాదాలకు మూలాలెక్కడున్నాయి? విజ్ఞత కలిగిన ప్రజలు, కార్మికులు, వారి కుటుంబాలు ఆలోచించవలసిన సమయమిది**

ఉక్కు కార్మాగారాల నిర్మాణంలో రష్యాకు ఒక ప్రత్యేకత ఉంది. భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యతనిస్తూ, నాణ్యమైన, మన్నికైన యంత్రపరికరాలు వినియోగిస్తూ, ఉత్పత్తి క్రమం ప్రారంభమైన తరువాత కూడా వచ్చే ఒడిదుడుకులను పర్యవేక్షించే వరకు ప్లాంట్‌లోనే ఉండి, సాంకేతిక సేవలందించిన చరిత్ర రష్యను నిపుణులకు ఉన్నదని ప్లాంట్ కార్మికులు గతాన్ని గుర్తుచేసుకుంటూ చెబుతున్నారు. ప్రపంచీకరణ జపం ఊపందుకున్న తరువాత "అంతర్జాతీయ ప్రమాణాలతో, ఆధునిక పద్ధతిలో ఉత్పత్తి" చేయాలనే సాకుతో, ముడుపుల కోసం, నాణ్యతలేని యంత్రపరికరాలతో, కర్మాగార నిర్మాణానికి స్వదేశీ, విదేశీ గుత్తకంపెనీలకు అనుమతులిచ్చారు. పరికరాల నాణ్యతలో "యూజ్ అండ్ త్రో" (ఉపయోగించి పారవేసి) పాలసీని అమలు చేయడం ప్రారంభించారు. భారీ పరిశ్రమల్లో ఒకటైన ఉక్కు పరిశ్రమలో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయాల్సిన మౌలిక విధానాన్ని తుంగలో తొక్కారు. అధికోత్పత్తిపై కేంద్రీకరించి, భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తున్న దాని కారణాలుగా, ప్లాంటులో అనేక ప్రమాదాలు జరుగుతూనేవున్నాయి. ప్రస్తుత స్థాయిలో భారీ ప్రాణనష్టాలు కాకపోవటం వల్ల బయటి ప్రపంచానికి అంతగా తెలియలేదు. గత సంవత్సర కాలంగా జరుగుతున్న ప్రమాదాలకు కారణం తెలుసుకోవడానికి నియమించబడిన పరిశ్రమల శాఖ డైరెక్టర్ నివేదిక ఇంతవరకు వెలుగు చూడలేదు. ఇది యాజమాన్య నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. ప్రస్తుత ప్రమాదానికి కారణమైన ఆక్సిజన్ యూనిట్‌లో సరఫరా గొట్టాలు 10 మిల్లీమీటర్ల మందం ఉండాల్సి ఉండగా 5 మిల్లీమీటర్ల మందంగల గొట్టాలనే కాంట్రాక్ట్ కంపెనీలు (గుత్తేదారులు) బిగించారని, వత్తిడి తట్టుకోలేకనే ఆ పైపులు బద్దలైపోయాయని ప్లాంట్ కార్మికులు వాపోతున్నారు.

**'టర్న్‌కీ' విధానం ఎందుకు?**

ప్లాంటులో విభాగాల రూపకల్పన, వాటి నిర్మాణం, ఉత్పత్తిని ప్రయోగాత్మకంగా (ట్రయల్ రన్) చేయించడం దాకా ఈ మొత్తం పనుల్ని 'టర్న్ కీ' సిస్టం క్రిందకి తెచ్చారు. టర్న్‌కీ విధానమంటే యాజమాన్యం టెండర్లను పిలచి, గుత్తేదార్లకు (కాంట్రాక్టర్లలకు) మొత్తం పనిని టోకుగా అప్పగించడమే. దస్తూర్ అండ్ కో, బ్లూస్టార్, సీమెన్స్ వంటి బహుళజాతి కంపెనీలు ఈ టర్న్‌కీ పద్ధతిలోనే ప్లాంట్‌లో నిర్మాణపనులు చేస్తున్నాయి. నిర్మాణ వ్యయం తక్కువగా అవుతుందని, నిర్మాణం త్వరితగతిన పూర్తవుతుందని, అందుకే టర్న్‌కీ పద్ధతిని అనుమతించామని, ప్లాంట్ యాజమాన్యం చెప్పేదంతా పచ్చి బూటకమే! ప్రభుత్వ రంగంలో నవరత్న హోదాగల సంస్థగా ఉంచి, టెండర్లలో ముడుపులు మింగి, ప్రైవేటు గుత్త కంపెనీల ఇష్టానుసారం నిర్మాణాలకు అప్పగించడమే ఈ టర్న్‌కీ లక్ష్యం. ఇది ప్రపంచబ్యాంక్ ఆదేశాలతో, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే. జాతి ప్రయోజనాల పట్ల, ఏ మాత్రం బాధ్యతలేని మన దళారీపాలకులు, ప్లాంట్ యాజమాన్యాలు, కమీషన్లు దిగమింగటానికి ఈ వినాశకర విధానాన్ని తెచ్చిపెట్టారు. దీనికి తోడుగా లక్షకోట్ల విలువగల స్టీల్‌ప్లాంట్ ఆస్తులను 5 వేల కోట్లుగా కుదించి చెబుతూ, డిజిన్‌వెస్ట్‌మెంట్ అమలులో భాగంగా షేర్ మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారు. దాదాపు 20 వేల ఎకరాల విస్తీర్ణం గల స్టీల్‌ప్లాంట్‌లో, 15 వేల ఎకరాల మిగులు భూమిపై కన్నేసిన మిట్టల్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు, గోతికాడ నక్కల్లా కాచుకున్నాయి. 14 వేల 457 కోట్ల రూపాయిల టర్నోవర్‌తో, 6వేల కోట్లరూపాయల రిజర్వు ఫండుతో, ఏటా 12వందల కోట్ల లాభాలతో నవరత్న హోదాను పొంది, కనీసం సొంత గనులకు నేటికీ నోచుకోని దుస్థితికి ఎవరు కారణం? ప్రపంచీకరణ విధానాలు అమలు చేయటంలో భాగంగా ప్లాంట్ నిర్వహణలో అనుభవం, నైపుణ్యం గల కార్మికుల సేవలను వినియోగించుకునే పద్ధతిని ప్రక్కన పెట్టి, ఉన్నత డిగ్రీల సర్టిఫికెట్లు, సిఫారసులు, ముడుపులు మొదలగు వాటినే పరిగణనలోనికి తీసుకుని బ్యూరాకాట్ల వత్తిళ్లతో ప్లాంట్‌ను నింపుతున్నారు. శిక్షణ పేరుతో విదేశాలకు పంపేవారిలో ఎక్కువ భాగం ఆ శిక్షణకు ప్లాంటులో వినియోగించే అవసరంలేని విభాగాలకు చెందినవారే. డిపార్టుమెంటు ప్రమోషన్లలలో కూడా ఉన్నత స్థాయి అధికారుల వత్తిళ్లకు లొంగి, సీనియర్ కార్మికులకు న్యాయంగా దక్కాల్సిన పదోన్నతులు దక్కటం లేదని, ఏ అనుభవం లేని జూనియర్లకే దక్కుతున్నాయని, కార్మికులు వాపోతున్నారు. దీని ప్రభావం అనివార్యంగా ప్లాంట్ నిర్వహణను కుంటుపరుస్తుందన్న వాస్తవాన్ని యాజమాన్యం తలకు ఎక్కించుకోవటం లేదు.

**ప్లాంటు విస్తరణ అసలు లక్ష్యం వేల కోట్ల రూపాయల్ని దోపిడీ చేయడానికే**

ప్లాంటు విస్తరణ అసలు రహస్యం కోట్ల రూపాయల్ని కేంద్ర ఉక్కుగనుల శాఖ మొదలుకొని, ప్లాంట్ యాజమాన్యపు ఉన్నత శ్రేణులు దాకా, యధేచ్ఛగా లూటీ చేయడానికే తప్ప, వేలాది మందికి ఉపాధి కల్పించడానికో, తగిన భద్రతా ప్రమాణాలతో ప్లాంట్‌ను నిర్మించడానికో ఉద్దేశించింది కాదు. అర్హులైన నిర్వాసితులనేక మంది నేటికీ ప్లాంట్‌లో ఎలాంటి ఉపాధీ పొందలేని దుస్థితిలో వున్నారు. ప్లాంట్ విస్తరణ అనేది చట్టబద్ధమైన దోపిడీకి మేలిముసుగే, ఈ టర్న్‌కీ విధానం! స్వదేశీ, విదేశీ కాంట్రాక్ట్ కంపెనీలకు టర్న్‌కీ పద్ధతిలో దోచిపెడుతూ, వారిచ్చే ముడుపులతో బ్రతికే పరాన్నభుక్కుల వ్యవస్థలతో ప్లాంట్ లుకలుకలాడుతుంది. వేలాది కాంట్రాక్టు కార్మికుల శ్రమను దారుణంగా దోపిడీ చేస్తూ, సూపర్ లాభాలు సాధిస్తూ, రెగ్యులర్ కార్మికులకు కొంత మెరుగైన జీతాలు ఇస్తూ, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల మధ్య విద్వేషాలను, అగాధాలను యాజమాన్యం పెంచుతున్నది. యూనియన్ గుర్తింపు ఎన్నికలను జనరల్ ఎన్నికల్ని తలపించే విధంగా నిర్వహించి, కార్మికుల్ని శాశ్వతంగా చీల్చివేస్తున్నారు. యాజమాన్యపు ఈ కుట్రలకు వ్యతిరేకంగా కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులను ఐక్యం చేసే కర్తవ్యాన్ని కార్మిక సంఘాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. పర్మినెంట్ కార్మికులు హక్కు తమ సౌకర్యాలు, సాధనకోసం పోరాడటంతో పాటు, శ్రమ దోపిడీకి గురౌతున్న వేలాది కార్మికుల పరిస్థితి గురించి ఆలోచించాలనే కార్మికవర్గ దృక్పథానికి దూరం చేయబడుతున్నారు . ఇది ట్రేడ్ యూనియన్ నాయకత్వాలు పరిశీలించుకోవలసిన అంశం.

దర్యాప్తు సంఘాలు వాస్తవాలను నిష్పక్షపాతంగా నివేదికలు ఇవ్వాలన్నా, వాటిని బహిరంగ పరచి తగు చర్యలు చేపట్టాలన్నా, కార్మికుల శ్రమ ఫలితంగా నవరత్న హోదా పొందిన, విశాఖ ప్రజల ప్రాణత్యాగాలతో ఏర్పడిన ప్రభుత్వ రంగ పరిశ్రమ, పెట్టుబడుల ఉపసంహరణకు గురికాకుండా ఉండాలన్నా, పరిశ్రమకు సొంత గనులు సాధించుకోవాలన్నా, పాలకుల దళారీ పారిశ్రామిక విధానాలను నిలువరించాలన్నా, కార్మికవర్గ ఐక్యతను సాధించడం కార్మిక సంఘాల ప్రాథమిక కర్తవ్యంగా వుండాలని ఎ.ఐ.ఎఫ్.టి.యు. (న్యూ) భావిస్తున్నది. కార్మికవర్గం ఒక్క త్రాటిపై నిలబడి, సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలి! కార్మికవర్గ ఐక్యత వర్ధిల్లాలి!

**విశాఖపట్నం**

**22-6-2012** అభినందనలతో

**అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (న్యూ)**

# విత్తనాలు-ఎరువులు -పురుగుమందులు-పంటరుణాలు-సాగునీరు తదితర రైతాంగ సమస్యలను తీవ్రం చేస్తున్న ప్రభుత్వ విధానాలు

**రాష్ట్రంలో** ఖరీఫ్ సీజన్ వచ్చింది. సేద్యం సజావుగా సాగాలంటే సాగునీరు, విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి అవసరం. వీటిని అందించటంలో ప్రభుత్వాలు విఫలమౌతూనే ఉన్నాయి. ఈ సంవత్సరం మరింత సమస్యగా ఇవి ముందు కొచ్చాయి. దీంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నది. రిజర్వాయర్లలో నీటి మట్టం పడిపోయిందని, సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తామో చెప్పలేమని ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతున్నారు. దీనికితోడు విత్తన కొరత, నకిలీ విత్తనాల సమస్య రైతులను వెంటాడుతున్నది. పాలకుల విధానాల ఫలితంగా ఎరువుల ధరలు ఆకాశాన్ని అందుకొంటూ ఉండటంతో సేద్యపు ఖర్చులు పెరగటం, రైతాంగానికి సమస్యగా మారింది.

## పెరిగిన విత్తన ధరలు

పత్తి, వరి, వేరుశనగ, మొక్కజొన్న మొదలైన విత్తనాలు అందించటంలో ప్రభుత్వం విఫలమౌతున్నది. 49 లక్షల క్వింటాళ్ళ వివిధ రకాల విత్తనాలు రాష్ట్ర రైతాంగానికి అవసరం. ఈ సంవత్సరం 50 లక్షల ఎకరాల్లో పత్తిసాగు అవుతుందని, ఇందుకోసం కోటి 9 లక్షల 40 వేల 584 పత్తిప్యాకెట్లు అవసరమౌతాయని, కోటీ 27 లక్షల 6వేల 982 ప్యాకెట్లను జిల్లాల వారిగా కేటాయించామని, 17.65 లక్షల ప్యాకెట్లు అదనంగా ఉన్నాయని వ్యవసాయశాఖ చెబుతున్నది. అలాంటప్పుడు రైతులు పత్తి విత్తనాల కోసం రోజుల తరబడి ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి, ఆందోళనలు జరపాల్సిన పరిస్థితి ఎందుకు ఉత్పన్నమవుతోంది? రాష్ట్రంలో 32 కంపెనీలు పత్తి విత్తనాలు సరఫరా చేయాల్సిఉండగా ఐదు కంపెనీలు మాత్రమే విత్తనాలను మార్కెట్‌లో ఉంచాయి. అదీ అరకొరగానే. మోన్‌శాంటో, కార్గిల్ లాంటి బడా కంపెనీలు, అవి ఉత్పత్తి చేసే విత్తనాల వలన రైతాంగానికి కలిగే ప్రయోజనం గురించి అన్ని రకాల మీడియా ద్వారా పెద్ద ఎత్తున మోసపూరిత ప్రచారం చేయటంతో, రైతాంగం ఆ కంపెనీల విత్తన కొనుగోళ్ళకు మొగ్గు చూపటంతో, కృత్రిమ కొరతను సృష్టించి 950 రూ. ఉన్న ప్యాకెట్‌ను బ్లాక్‌లో 1800 నుండి 2000వేల రూపాయలదాకా అమ్మి విపరీతమైన లాభాలు గడిస్తున్నారు. ఈ కంపెనీల విత్తనాలు ఇదివరకే అనేక ప్రాంతాల్లో రైతాంగాన్ని తీవ్రంగా నష్టపర్చాయన్న వాస్తవాలు వెల్లడైనాయి. ఈ సంవత్సరం కార్గిల్-మోన్‌శాంటో అమ్మిన విత్తనాలు రాష్ట్రంలో లక్షకుపైగా ఎకరాల్లో అసలు మొలకెత్తనేలేదు. దీన్ని ఈ కంపెనీలు అంగీకరించాయి. పైవిషయాలను పరిశీలిస్తే పత్తివిత్తనాల కొరత బడా సంస్థల సృష్టే అన్న విషయం అర్థమౌతుంది.

రైతులకు విత్తనాలు అంటే, పత్తివిత్తనాలే అన్న ప్రచారం తప్ప మిగతా విత్తనాల గురించి పట్టించుకోవటం లేదు. వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న మొదలైన ముఖ్యమైన విత్తనాల ఉత్పత్తికి, సేకరణకు ప్రభుత్వ సంస్థలు తగిన ప్రాధాన్యం ఇవ్వటంలేదు. అంతేకాకుండా ఏ సంవత్సరం కూడా సబ్సిడీ విత్తనాలను పూర్తిగా రైతులకు అందించలేదు. ఈ సంవత్సరం 13.82 లక్షల క్వింటాళ్ళ విత్తనాలు సబ్సిడీ కింద రైతులకు అందచేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు లక్షక్వింటాళ్ళు కూడా ఇవ్వలేకపోయింది. విత్తనాలపై యిచ్చే సబ్సిడీని కూడా 50% నుండి 30% తగ్గించింది. అంతే కాకుండా సబ్సిడీ విత్తనాల ధరలను కూడా పెంచింది. గత సంవత్సరం క్వింటాల్ వేరుశనగ ధర 3600 రూ. ఉంటే ఈ సంవత్సరం 3900 రూ.కు పెంచింది. బి.పి.టి. వరి విత్తనాలు 1950 నుండి 2100 రూ, ఎంటియు. 1010, 1001 విత్తనాలు 1850 నుండి 2000 రూ. పెంచింది. మొక్కజొన్న, జొన్న, ఆముదం మొదలైన విత్తనాల ధరలను పెంచింది. పెరిగిన సబ్సిడీ విత్తనాల ధరల వలన రైతులపై 100 కోట్ల భారం పడింది.

## భయపెడుతున్న ఎరువుల ధరలు

సేద్యంలో దేశీయ విత్తనాల స్థానంలో బహుళజాతి సంస్థల హైబ్రీడ్, బి.టి. విత్తనాలు పూర్తిస్థానాన్ని ఆక్రమించాయి. వీటివలన రైతులకు అధిక దిగుబడులు వస్తాయని ప్రచారంతో పాటు అందుకు సాంప్రదాయ ఎరువుల స్థానంలో రసాయన ఎరువుల వాడకం వైపు రైతులను మళ్లించారు. ఫలితంగా సేద్యంలో ఎరువుల ఖర్చు పెరగటంతోపాటు, భూమి గుల్లబారి, భూసారం క్షీణించి, రసాయన ఎరువులు అధికంగా వాడందే పంట దిగుబడిరాని పరిస్థితి రైతుకు ఏర్పడింది. ఫలితంగా సేద్యంలో రసాయన ఎరువుల వాడకం రైతులకు ఇష్టమున్నా లేకపోయినా తప్పనిసరైంది.

రైతుల ప్రయోజనాలకు అనుగుణమై ఎరువుల విధానం దేశపాలకులకు లేకుండా పోయింది. రైతులకు కావాల్సిన ఎరువులు అందించటంలో పాలకులు విఫలమౌతున్నారు. ఎరువుల పరిశ్రమలపై సామ్రాజ్యవాద కంపెనీల పట్టు ఉండటం, వాటి ప్రయోజనాలకు అనుగుణంగా పాలకులు వ్యవహరించటం, ఎరువుల దిగుమతి వలన వాటి ధరల పెరుగుదలతోపాటు, కొన్ని సందర్భాల్లో ఎరువుల కొరత సృష్టించబడుతున్నది. ప్రస్తుతం దేశంలో 139 ఎరువుల కర్మాగారాలు ఉన్నాయి. వీటిలో 29 యూరియా, 19డీ.ఏ.పి., 80 సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 10 అమోనియం ఫాస్ఫేట్, ఒక కాల్షియం అమోనియం నైట్రేట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇవేవీ సమృద్ధిగా ఉత్పత్తులు చేయటం లేదు. ఆ దిశలో ప్రభుత్వ విధానాలు లేవు. ఫలితంగా 1990 నుండి ఇప్పటివరకు ఎరువుల ఉత్పత్తిలో అభివృద్ధిలేదు. గత 13 సం॥ కాలంలో కొత్తగా ఒక్క కర్మాగారం కూడా స్థాపించబడలేదు. ప్రభుత్వరంగ కర్మాగారాలైన సింద్రీ, రామగుండం, దుర్గాపూర్, హాల్దియా, తాల్చేరు, కొర్బీ, బరోనీ, గోరఖ్‌లలో మూత బడిన కర్మాగారాలను 32 వేల కోట్ల రూపాయలతో పునరుద్ధరిస్తామని ప్రభుత్వం చెప్పి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, అందుకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. మన రాష్ట్రంలో రామగుండం ఎఫ్.సీ.ఐ. 1999లో మూతపడింది. రోజుకి 1500 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఈ ఫ్యాక్టరీకి ఉంది. మూతపడి 13 సంవత్సరాలైనా పునరుద్ధరణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటమే పాలకుల విధానం ఏమిటో స్పష్టంచేస్తున్నది.

భారతదేశంలో రైతులకు సబ్సిడీ లభిస్తుందంటే అది ఒక్క ఎరువులపైనే. ఇతర దేశాలతో పోల్చుకుంటే అదికూడా నామమాత్రంగానే ఉంది. సామ్రాజ్యవాదుల, ప్రపంచ బ్యాంక్ వత్తిడి ఫలితంగా ఎరువులపై ఇస్తున్న సబ్సిడీని క్రమంగా తగ్గించి వేస్తున్నది. అందుకు ఎరువుల్లో పోషక విలువలను బట్టి సబ్సిడీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఎరువులపై 60,974 కోట్ల రూపాయలను ప్రభుత్వం సబ్సిడీ యిస్తున్నది. ఇది రైతులకు కాకుండా నేరుగా ఫ్యాక్టరీలకే అందచేస్తున్నది. అంటే ఇచ్చే సబ్సిడీ ఫ్యాక్టరీలకే అన్నది స్పష్టమౌతున్నది. రైతాంగానికి యిస్తున్న నామమాత్రపు సబ్సిడీ ప్రభుత్వానికి పెనుభారంగా మారిందని బూర్జువా ఆర్థిక నిపుణుల ప్రచారం-అత్యంత కీలకమైన భారత వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి కూరుకుపోయేలా చేయటం కోసం సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో జరుగుతున్నదే.

ఎరువుల సబ్సిడీని ప్రభుత్వం ఏ విధంగా తగ్గించుకొంటున్నదీ 2011-12, 2012-13 సంవత్సరాల మధ్య ఎరువుల సబ్సిడీని పరిశీలిస్తే అర్థమౌతుంది.

**సూక్ష్మపోషకాలపై రాయితీ తగ్గింపు (కిలోకు రూ.లో)**

| పోషకం | 2011-12 రాయితీ | 2012-13 రాయితీ |
|---|---|---|
| నత్రజని | 27.15 | 24.00 |
| భాస్వరం | 32.33 | 21.80 |
| పొటాష్ | 26.75 | 24.00 |

**ఎరువులపై సబ్సిడీ తగ్గింపు (టన్నుకు రూ.లో)**

| ఎరువు | 2011-12లో సబ్సిడీ | 2012-13 సబ్సిడీ | తగ్గింపు |
|---|---|---|---|
| డీఏపీ | 19,763 | 14,350 | 5,413 |
| డిఏపీవైట్ | 19,573 | 13,434 | 5,139 |
| ఎంఏపి | 19,803 | 19,978 | 5,825 |
| పొటాష్ | 16,054 | 14,400 | 1,654 |
| టిఎస్‌పి. | 14,875 | 10,030 | 4,845 |
| 14:35:14:0 | 18,866 | 14,351 | 4,515 |
| 12:32:16:0 | 17,887 | 13,697 | 4,190 |
| 14:28:14:0 | 16,602 | 12,602 | 3,777 |

**(ఆధారం : రైతువాణి-జూన్ సంచిక)**

పై పట్టికను పరిశీలిస్తే రెండు సంవత్సరాల వ్యవధిలో ఎక్కువ మొత్తంలో సబ్సిడీ ఏ విధంగా తగ్గించిందీ తెలుస్తున్నది. సబ్సిడీ తగ్గింపు వలన ఎరువుల రేట్లు పెరుగుతాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఎరువులపై యిచ్చే సబ్సిడీని తగ్గించుకొంటున్న ప్రభుత్వం, ఎరువుల ధరల నిర్ణయాధికారాన్ని కూడా వదులుకొంది. మూడు సంవత్సరముల క్రితం వరకు ఎరువుల ధరలను నిర్ణయించే అధికారం కేంద్రప్రభుత్వం చేతుల్లోనే ఉండేది. దీని వలన ధరలపై నియంత్రణ ఉండేది. ప్రపంచబ్యాంక్ వత్తిడి మేరకు ధరల నిర్ణయాధికారాన్ని వదులుకొని, ఆ అధికారం ఫ్యాక్టరీ యజమానులకే యిచ్చింది. దీంతో ఎరువుల ధరలపై నియంత్రణ లేకుండా పోయింది తమ యిష్టానుసారం ధరలను నిర్ణయించే స్వేచ్ఛ ఫ్యాక్టరీ యజమానులకు లభించింది. ఏదో ఒక కారణంతో ఎరువుల ధరలను విపరీతంగా పెంచటం ప్రారంభించారు. గత సంవత్సరం నాలుగుసార్లు, ఈ సంవత్సరం ఇప్పటికే రెండుసార్లు ఎరువుల ధరలు పెరిగాయి.

ఈ క్రింది పట్టిక ద్వారా 2010-12 సంవత్సరాల్లో ఎరువుల ధరల పెరుగుదల ఈ విధంగా ఉంది.

**పెరిగిన ఎరువుల ధరలు (రూ.లో)**

| రకం | 2010సబ్సిడీ | 2012 సబ్సిడీ |
|---|---|---|
| డీఏపీ | 488 | 1260 |
| 28-28-0 | 389 | 1298 |
| 20-20-0-13 | 327 | 982 |
| 14-35-14 | 428 | 1224 |
| సింగిల్‌సూపర్‌ఫాస్ఫేట్ | 167 | 338 |
| పొటాష్ | 234 | 834 |
| యూరియా | 250 | 281 |

**(ఆధారం ఈనాడు, జూన్ 13)**

పై పట్టికను పరిశీలిస్తే ఎరువుల ధరలు మూడు నుండి నాలుగు రెట్లు పెరిగాయన్న వాస్తవంతోపాటు 700 కోట్ల భారాన్ని రాష్ట్ర రైతులు మోయవలసి వస్తున్నది. ఈ సంవత్సరం రాష్ట్రంలో ఎరువులు తగినంతగా ఉన్నా, వ్యాపారులు మాత్రం లేవని చెబుతూ వాటి ధరలను పెంచి దొంగచాటుగా రైతులకు విక్రయిస్తున్నారు. గత సంవత్సరపు ఎరువులను పాత ధరలకే అమ్మాలని ప్రభుత్వం చెబుతున్నా వ్యాపారులు దాన్ని పాటించటంలేదు. ప్రభుత్వం ప్రకటనకే పరిమితమైంది.

## పెరిగిన పురుగు మందుల ధరలు

దేశంలోకి విదేశీ విత్తనాల దిగుమతితోపాటు, వాటి ద్వారా చీడపీడలు దిగుమతి అవుతున్నాయి. మనదేశ వాతావరణానికి అనుకూలమైన విత్తనాలు కాకపోవటమే అందుకు కారణం. విదేశీ కంపెనీలు విత్తనాలతో పాటు, పురుగు మందులను తయారు చేస్తున్నాయి. ఆ కంపెనీలు ఎగుమతి చేసే విత్తనాల నుండి సంక్రమించే తెగుళ్ళ నివారణకు పురుగుమందులను విక్రయిస్తున్నాయి. తెగుళ్ళ నివారణకు మందులు వాడితేనే పంట దక్కని పరిస్థితిని మన రైతులకు కల్పించాయి. ఒకపురుగుమందు వాడితే ఆ పురుగు స్థానంలో మరొకటి వ్యాపిస్తున్నది. ఫలితంగా పైరు రక్షణకోసం పంట చేతికి వచ్చేదాకా మందులు వాడుతూనే వుండాలి. సేద్యపు ఖర్చుల పెరుగుదలలో ఇది ఒక భాగంగా ఉంది. రైతాంగంపై ఆర్థిక భారం పడుతుంటే పురుగుమందు తయారీ కంపెనీలు లాభాల రూపంలో వేలకోట్ల రసాయనాలను తరలించుకు పోతున్నాయి. పురుగు మందుల వాడకం మన రాష్ట్రంలో విపరీతంగా పెరుగుతున్నాయి. 2008-12 సం॥రాల్లో పురుగుమందుల వాడకం, ఖర్చు ఈ విధంగా ఉంది.

**రాష్ట్రంలో పురుగుమందుల వినియోగం**

| సంవత్సరం | వినియోగం(టన్నుల్లో) | ఖర్చు (కోట్ల రూ.) |
|---|---|---|
| 2008-09 | 8,374 | 1,270 |
| 2009-10 | 8,148 | 1,210 |
| 2010-11 | 8,889 | 1,520 |
| 2011-12 | 8,929 | 1,600 |

పై పట్టికను గమనిస్తే పురుగు మందుల వాడకం ఎంత పెద్ద ఎత్తున ఉందో రైతాంగం ఎంత ఖర్చు పెడుతున్నారో, ఏ విధంగా కంపెనీల దోపిడీకి గురౌతున్నదీ తెలుస్తుంది. పురుగుమందుల వాడకంతో పాటు వాటి ధరలు పెరుగుతున్నాయి. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం 10% నుండి 15% వరకు అన్ని కంపెనీలు ధరలను పెంచాయి. పెరిగిన ధరల వలన-రాష్ట్రంలో తీవ్రమైన కరువు ఏర్పడి 45% పంటలు దెబ్బతిన్నా-1600 కోట్ల రూ॥ పురుగు మందుల వాడకం జరిగిందంటేనే వాటి వినియోగం ఎలా పెనుభారంగా మారిందో అర్థమౌతుంది.

## పెరిగిన పంట ఖర్చులు

సేద్యానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరల పెరుగుదలతోపాటు, డీజిల్, సేద్యపు పరికరాల ధరలు పెరగటం వలన ప్రతి సంవత్సరం సేద్యపు ఖర్చులు పెరిగి రైతులకు మోయలేని భారంగా మారింది. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారమే మూడు సంవత్సరాల్లో సేద్యపు ఖర్చులు ఎంతగా పెరిగాయో అర్థమౌతుంది.

**ఖరీఫ్‌లో పంట సాగుఖర్చులు (రూ.లో)**

| పంటరకం | 2010 | 2011 | 2012 |
|---|---|---|---|
| వరి ఏ గ్రేడ్ | 21,562 | 26,021 | 31,440 |
| వరి సాధారణ | 21,076 | 24,392 | 30,688 |
| పత్తి | 18,522 | 22,985 | 25,413 |
| మొక్కజొన్న | 13,597 | 15,590 | 20,648 |
| వేరుశనగ | 11,269 | 12,485 | 13,300 |
| సోయాబిన్ | 11,218 | 11,506 | 13,859 |
| పొద్దుతిరుగుడు | 6,653 | 7,087 | 11,859 |
| కందులు | 7,192 | 8,802 | 9,706 |
| మినుములు | 5,683 | 7,689 | 8,870 |
| పెసలు | 5,318 | 6,960 | 7,588 |
| రాగులు | 6,010 | 6,421 | 8,890 |
| నువ్వులు | 4,309 | 4,480 | 4,950 |
| జొన్న | 4,806 | 5,496 | 6,248 |
| సజ్జ | 5427 | 5,934 | 6,420 |

**(ఆధారం సాక్షి)**

పై పట్టికను గమనించినప్పుడు మూడు సంవత్సరాల కాలంలో వరికి 10 వేలు, పత్తి, మొక్క జొన్నకు ఏడువేలకు పైగా సేద్యపు ఖర్చులు పెరిగాయి.

ఒకవైపున సేద్యపు ఖర్చులు పెరుగుతున్నా, మరొకవైపున పంటలకు మాత్రం సరైన ధర లభించటం లేదు. ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు రైతాంగ ప్రయోజనాలను ప్రతిబింబించటంలేదు. మద్దతుధర విధానమే లోపభూయిష్టంగా ఉంది. మద్దతు ధరల నిర్ణయంలో వ్యవసాయశాఖ సిఫార్సులను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవటంలేదు. బస్తా ధాన్యానికి ఎరువుల బస్తా ధర కూడా లభించటం లేదంటే రైతుల దైన్య స్థితి ఏ విధంగా ఉందీ అర్థమౌతుంది. 2012-13 సం॥ పంటలకు మద్దతు ధరపై వ్యవసాయ శాఖ సిఫార్సులను పట్టించుకోకుండా ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించింది. వ్యవసాయశాఖ సిఫార్సులు, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలను గమనిస్తే రెంటిమధ్య ఉన్న వ్యత్యాసం ఎంతగాఉందీ అర్థమౌతుంది.

**వ్యవసాయశాఖ సిఫార్సులు-ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర (క్వింటాల్‌కి ధర రూపాయలలో)**

| పంట | వ్యవసాయశాఖ సిఫార్సు | కేంద్రంయిచ్చింది |
|---|---|---|
| వరి ఏ గ్రేడ్ | 2,135 | 1,280 |
| వరి సాధారణ | 2,102 | 1,250 |
| వేరుశనగ | 5,543 | 3,700 |
| కంది | 6,066 | 4,000 |
| మినుము | 5,544 | 4,300 |
| పెసర | 5,691 | 4,500 |
| సోయాబిన్ | 3,086 | 2,200 |
| పత్తి | 6,386 | 3,900 |
| పొద్దుతిరుగుడు | 5,559 | 3,700 |

**(ఆధారం : ఈనాడు, జూన్ 18)**

వ్యవసాయశాఖ చేసే సిఫార్సులు కూడా రైతుల ప్రయోజనాలను పూర్తిగా నెరవేర్చేవి కాకపోయినా, వాటిని కూడా పాలకులు అమలుపర్చకుండా మరింత దారుణంగా మద్దతు ధరలను ప్రకటించటం రైతుల ప్రయోజనాలను బలిపెట్టటమే.

పెరిగిన సేద్యపు ఖర్చులకు అనుగుణంగా పంటలకు గిట్టుబాటు ధరలు లభించక పోవటంతో అప్పుల పాలైన రైతులకు తిరిగి సేద్యపు పెట్టుబడి సమకూర్చుకోవటం గగనమౌతున్నది. రైతులకు పంటరుణాలు పెంచుతున్నామని ప్రతిసంవత్సరం ప్రభుత్వం ప్రకటిస్తున్నా, ప్రకటించిన మేరకు ఏ సంవత్సరం కూడా రైతులకు రుణాలు ఇవ్వలేదు. కౌలు గుర్తింపు కార్డుల ద్వారా కౌలు రైతులకు రుణాలు అంద చేస్తామని ప్రభుత్వం చెప్పే మాటలు వంచనా పూరితంగా ఉన్నాయి. ఆధారంలేకుండా రుణాలు ఇవ్వబోమని బ్యాంకులు చెప్పటమే అందుకు నిదర్శనం. ప్రాధాన్యతా రంగాలకు యిచ్చే రుణాల్లో 18 శాతం వ్యవసాయ రంగానికి యివ్వాలన్న దాన్ని బ్యాంకులు ఏనాడూ అమలు జరపలేదు. ఇప్పటికీ అత్యధికమంది రైతులు ప్రైవేట్ అప్పులపైనే ఆధారపడతూ వారి దోపిడీకి గురౌతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విధానాలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయానికి ప్రాధాన్యత యిచ్చి సాగునీటిని విడుదల చేయాలని, ఎరువులు, విత్తనాల ధరలను తగ్గించి రైతులకు అందచేయాలని, కౌలు రైతులతో సహా రైతులందరికీ పంటరుణాలు ఇవ్వాలని, పంటలకు సరసమైన ధరలు ప్రకటించాలని రైతాంగం సమైక్యంగా ఉద్యమించాలి. ★

## వరంగల్ జిల్లాలో ప్రజా ఆందోళనలు

# రంగాయ చెరువు రిజర్వాయర్ వ్యతిరేక ఆందోళన–నిర్బంధం

**వరంగల్‌జిల్లా** నల్లబెల్లి మండలం గోవిందాపురం శివారులోని రంగాయచెరువును, దాని పక్కనే గల ఎర్రచెరువును కలుపుతూ రంగాయ చెరువు రిజర్వాయరు పథకం అక్కడి ప్రజలెవరూ కోరకుండానే ముందు కొచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం తెలియచేస్తున్న 320 కోట్ల రూపైయల ఈ పథకం ప్రకారం 7 గ్రామాలతో సహా 3,194 ఎకరాల భూమి ముంపుకి గురౌతాయి. అర్సవెల్లి, లైన్‌తండా, ఎర్రాయతండా, లక్ష్మీతండా, మూడు చెక్కలపల్లి, కొండాపురం తదితర గ్రామాలు ముంపుకి గురౌతాయి. ఇవన్నీ ప్రధానంగా లంబాడీ, ఆదివాసీ, దళిత ప్రజలు అనేక దశాబ్దాలుగా పోడు కొట్టుకొని జీవిస్తున్న ప్రాంతం. ఒకప్పుడు లంబాడీ ప్రజలు సంచార జాతులుగా ప్రజలమధ్య వర్తక వ్యాపారాలకు ముఖ్య వాహకులుగా జీవించిన కాలం ఉంది. సామ్రాజ్యవాదం సంచార జాతుల జీవన వైవిధ్యాన్ని ధ్వంసం చేసి నేరస్త తెగలుగా చిత్రించి వేధించింది. భూస్వామ్య, పెత్తందారీ వర్గాలు విలువైన సాగుయోగ్యమైన భూమిని తమ ఆక్రమణలో ఉంచుకొని, సంచార జాతులు వ్యవసాయంలో స్థిరపడే సమయానికి భూములు లేకుండా చేసారు. అలాంటి స్థితిలో లంబాడీ తదితర సంచార తెగల ఆదివాసులు అడవులు–గుట్టలకు ఆనుకొనివున్న ప్రాంతాలలో ఏ భూస్వాములకూ ఆశ కలగని ప్రాంతాలకు చేరి బండలు పగులకొట్టి రాళ్ళు తీసి, మోళ్ళు తీసి పోడుచేసి చిన్నచిన్న చెలకలుగా చేసుకొని దుర్భరమైన పరిస్థితులలో వ్యవసాయం సాగించారు. కరీంనగర్ నుంచి ఖమ్మం వరకూ, గుట్టల పక్కన విస్తరించిన వీరి భూములు నేడు మైనింగు మాఫియా కళ్ళబడ్డాయి. వీటిని కబ్జా చేసేందుకు, లంబాడీ, ఆదివాసీ, దళిత ప్రజలను గెంటవేసేందుకు నల్లబెల్లి, ములుగు, మల్లింపల్లి, కోనాపురంల నుండి బయ్యారం వరకూ పెద్ద కుట్ర జరుగుతోంది.

ప్రస్తుత రంగాయ చెరువు ప్రాజెక్టు నిర్మాణమైతే ముంపుకు గురయ్యే 3 వేల ఎకరాల భూమిలో వ్యవసాయంలో ఉన్న 1900 ఎకరాలలో అత్యధిక భాగం భూమి పోడు చేసుకుంటున్న వారిదే. వీటిలో కేవలం 200 ఎకరాలకి మాత్రమే పట్టాలు ఉన్నాయి. అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న ఆదివాసులందరికీ పట్టాలు ఇవ్వాల్సిఉన్నా నేటికీ ఆ పని జరగలేదు. అది అటవీ భూమి కనుక అటవీశాఖ అనుమతి కావాలి. ప్రజాభిప్రాయ సేకరణ జరగాలి. రంగాయ చెరువు ప్రాజెక్టు మంచి చెడులపై ప్రజలతో చర్చించాలి. కానీ ఈ ప్రాజెక్టు వ్యవహారాలన్నీ రహస్యంగాఉన్నాయి. ప్రజలు వ్యతిరేకిస్తున్నందున 3టి.ఎం.సి.లు నిల్వచేయాల్సిన రిజర్వాయరు సామర్థ్యాన్ని ఒక టి.ఎం.సి.కి తగ్గిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రజలు పోలవరం మొదలుకొని అనేక ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నారు. కానీ ప్రభుత్వం ఆగడం లేదు. మరి ప్రజల వ్యతిరేకత వల్ల ఒక టి.ఎం.సి.కి తగ్గిస్తున్నామని చెపుతున్నారు. ఈ ఒక టి.ఎం.సి. నీటితోనే 32 వేల ఎకరాలకి నీరందిస్తామని ప్రభుత్వం చెపుతోంది. ఒక టి.ఎం.సి.తో 32 వేల ఎకరాలకి నీరందించడం అసాధ్యం. ప్రజలెవ్వరూ ఈ ప్రాజెక్టును కోరలేదు. కానీ దాని పక్కనే గల మల్లంపల్లిలో ఇనుపఖనిజ శుద్ధి కర్మాగారం రాబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దేవాదుల నుంచి పాకాల చెరువుకి, అక్కడ నుండి రంగాయ చెరువుకి నీరు తరలింపు జరపడం వెనుక ముడి ఇనుప ఖనిజ శుద్ధి కర్మాగారం కోసమే ఇంత నీటిని నిల్వచేయబోతున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్ట్ అన్నది–అన్ని జలయజ్ఞ ప్రాజెక్టులలాగానే ఇక్కడా బూటకమని తేలుతున్నది. నిజానికి ఇరిగేషన్ అభివృద్ధే లక్ష్యమైతే, కాకతీయుల కాలం నాటి పాకల, రామప్ప, లక్నవరం తదితర భారీ జలాశయాలు, అసంఖ్యాకమైన చెరువులు–వీటన్నింటికీ లింకు కాలువల వ్యవస్థతో ఒకప్పుడు మంచిగ పంటలు పండించిన ప్రాంతమిది. చెరువులన్నీ బొందపెట్టించి, భూస్వాములు, పెత్తందార్లచే ఆక్రమింపజేసి, బోరు బాయిలకు అప్పులిప్పిచ్చి రైతులను రుణగ్రస్తులుగా చేసి ఆత్మహత్యల చేసుకొనేలా చేసిన ప్రభుత్వం ఇది. అందువలన ప్రభుత్వాల చర్యలన్నీ అనుమానించాల్సిన పరిస్థితిలో ప్రజలు పడిపోయారు.

### ప్రజల నిరసనల క్రమం

3-5-2012న హఠాత్తుగా పి.సి.సి. సభ్యులు, కాంగ్రెసు నాయకులు దొంతు మాధవరెడ్డి, ఆయన సోదరుడు రంగాయ చెరువు ప్రాజెక్టు కాంట్రాక్టు తీసుకొన్న మెగా కంపెనీ అధికారులు, దేవాదుల ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టుకోసం ఉద్దేశించిన గోవిందాపురం తదితర గ్రామాలలోకి వచ్చారు. అప్పటికే రంగాయచెరువు గురించిన అనేక ప్రచారాలతో భయాందోళనలతో ఉన్న ప్రజలు, వచ్చిన వారంతా భూమి పూజకు వచ్చారని అర్థం చేసుకొని ఒక్కసారిగా నిలవేసారు. తమ గ్రామం వదలి పోవాలని డిమాండ్ చేసారు. స్త్రీలు, యువకులు గట్టిగా వెంటబడి డిమాండ్ చేయడంతో వచ్చిన నాయకులు, అధికారులు అక్కడినుండి వెళ్ళిపోయారు. వెళుతూ పోలీస్ అధికారులు ప్రజల్ని బెదిరించారు.

4-5-2012న వివిధ ప్రజా సంఘాల, పార్టీల నాయకులు సమావేశమై "రంగాయ ప్రాజెక్టు వ్యతిరేక, అక్రమ మైనింగు వ్యతిరేక పోరాట కమిటి''ని ఏర్పరచుకొన్నారు. సిపిఐ(ఎం-ఎల్), రైతుకూలీసంఘం (ఆం.ప్ర.), రైతుకూలీసంఘం (ప్రతిఘటన), తెలంగాణా యునైటెడ్ ఫ్రంట్ (టఫ్), తడుందెబ్బ, లంబాడీ హక్కుల పోరాట సమితి, యాదవ హక్కుల పోరాట సమితి, తదితర సంస్థలు దీనిలో భాగస్వాములుగా ఉన్నారు. మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్), ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణా సంస్థ (ఓపిడిఆర్)లు ప్రజల న్యాయమైన పోరాటానికి సంఘీభావంగా కమిటీలో పాల్గొన్నాయి. కామ్రేడ్ మోడెం మల్లేష్ గౌరవాధ్యక్షులుగా; కుంటా రవీంద్రయాదవ్ అధ్యక్షులుగా; ప్రధాన కార్యదర్శిగా యం.డి. యాకూబ్, సహాయ కార్యదర్శిగా అక్కిపెల్లి రమేష్; ఉపాధ్యక్షులుగా బీరం రాము తదితరులతో కమిటీ ఏర్పడింది. ఏ అధికారులనూ ఊర్లోకి రానివ్వబోమని, సర్వేలు జరపనీయబోమని ప్రజలు ప్రకటించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. 7-5-2012 నుండి గోవిందపురంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షా శిబిరాన్ని ప్రారంభిస్తూ బీరం రాము ప్రాజెక్టుల పేరుతో ప్రజల్ని నిర్వాసితుల్ని చేస్తున్న తీరును దుయ్యబట్టారు. సోంపేట తరహా పోరాటాల స్ఫూర్తితో భూముల్ని రక్షించుకోవాలని పిలుపు నిచ్చారు. 11-5-2012న నిరాహారదీక్షా శిబిరం ముగింపు సభలో తెలంగాణా యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ విమల వచ్చి తెలంగాణాలో వనరులు కబ్జా అవుతున్న తీరును వివరించారు. పోరాటానికి సంఘీభావం ప్రకటించారు.

### కామ్రేడ్ మల్లేష్‌పై రౌడీషీటర్ బనాయింపు–నిరసన

ఈ క్రమంలో అధికారులను నాయకులను ప్రజలు నిలవేయడం, సర్వేను అడ్డుకోవడం వంటి చర్యలకు, అక్రమ మైనింగ్ సాగిస్తున్న భూస్వాములకు వ్యతిరేకంగా బుచ్చిరెడ్డిపల్లి వంటిచోట ప్రజల్ని కదిలిస్తున్నందుకు 8-5- 2012న కామ్రేడ్ మోడెం మల్లేష్‌పై గూడూరు సి.ఐ. రౌడీషీట్ బనాయించినట్లు 9వ తేదీన పత్రికల వార్త ద్వారా తెలిసింది. ఈ వార్త తెలిసిన వెంటనే 10-5-2012న వందలాది మంది ప్రజల నర్సంపేటలో రాస్తారోకో చేశారు. అనంతరం ఆర్‌డిఓ కార్యాలయానికి వెళ్ళారు. ఈ కార్యక్రమానికి రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య హాజరై గత 23 సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాలలో తలమునకలై వున్న కామ్రేడ్ మల్లేష్‌పై ఈ రకపు వేధింపులు దుర్మార్గమైనవని, నెక్కొండ మొదలు, చిలకమ్మనగర్, బుచ్చిరెడ్డిపల్లెలనుండి రంగాయచెరువు వరకూ జరుగుతున్న ఆందోళనలలో ప్రజలకు నాయకత్వం వహిస్తున్నందుకే రౌడీషీటర్ పేరిట ఈ వేధింపులని వివరించి, రౌడీషీట్ ఎత్తివేయాలని అధికారులను గట్టిగా డిమాండ్ చేశారు. దీని కొనసాగింపుగా నల్లబెల్లి, దుగ్గొండి, తదితర మండలాలలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.), ఏఐఎఫ్‌టియు(న్యూ)ల ఆధ్వర్యాన నిరసన ప్రదర్శనలు జరిగాయి.

రంగాయ చెరువు ప్రాజెక్టు ఎందుకు? అని ప్రశ్నించి నందుకు, అక్రమ మైనింగువల్ల భూములు కోల్పోతున్న పీడితులకి అండగా నిలబడ్డందుకే ఈ వేధింపులని వివిధ ప్రజా సంఘాలు, పార్టీల నాయకులంతా తీవ్రంగా ఖండించారు. ఎం.ఆర్.పి.యస్. రాష్ట్ర కార్యదర్శి కల్లిపెల్లి ప్రణయదీప్ మాదిగ, మానవ హక్కులవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బదావత్ రాజు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఆగబాయిన రవి, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ధారావత్ రాజేష్ నాయక్, తెలంగాణా గ్యాడ్యుయేట్స్ అసోసియేషన్ సాబరాతి మల్లేషం, ఐకాస జిల్లా కో ఛైర్మన్ అంబటి శ్రీనివాస్, టిపిఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జనగాం కుమార స్వామి, ఎం.సి.పి.ఐ. రాష్టకార్యదర్శి వర్గసభ్యుడు గాదెగొనె రవి, జిల్లా కార్యదర్శి మద్దికాయల అశోక్, గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అధ్యక్షులు సుధాకర్‌గౌడ్, తమ ఖండనలను తెలియచేశారు. తెలంగాణా రాష్ట్రసమితి ఆధ్వర్యంలో ధర్నా జరిపి ఆర్‌డిఓని కలిసి మోడెం మల్లేష్‌పై రౌడీషీటర్ ఎత్తివేయాలని కోరుతూ నర్సంపేట నాయకులు నాయని నర్సయ్య, జిల్లా కార్యదర్శి దార్ల రమాదేవిలు విజ్ఞాపన పత్రం అందజేశారు. కామ్రేడ్ మోడెం మల్లేష్‌పై రౌడీషీటర్ పెట్టడాన్ని ఖండిస్తూ సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ చంద్రన్న ఒక ప్రకటన చేస్తూ విప్లవోద్యమాన్ని అణచివేయటం కోసమే పాలకవర్గాలు ప్రజా సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తున్న విప్లవకారులపై కేసులు బనాయిస్తున్నారని ఖండించారు. ఈ విధంగా అనేక ప్రజాతంత్రశక్తులు, పార్టీల నుండి విస్తృతమైన నిరసన వ్యక్తం అయింది. ఈ సందర్భంగా కామ్రేడ్ మోడెం మల్లేష్‌పై బనాయించిన రౌడీషీటర్‌ను ఖండిస్తూ సంఘీబావం ప్రకటించిన సంస్థల నాయకులందరికీ సిపిఐ (ఎం-ఎల్) నర్సంపేట ప్రాంత కమిటి ధన్యవాదాలు తెలిపింది.

ఈ ఆందోళన కొనసాగుతుండగానే మే 19న మరల వచ్చిన సర్వే బృందాలను ఎర్రాయచెరువు తండా గిరిజనులు అడ్డుకొని వారు పాతిన సరిహద్దు రాళ్ళను తీసివేసి తమ నిరసన తెలియచేశారు. ప్రజల ఆందోళనతో అధికారులు సర్వే రాళ్ళను పాతే కార్యక్రమాన్ని విరమించుకొని వెళ్ళిపోయారు. దీని అనంతరం 2-6-2012న పోరాట కమిటి ఆధ్వర్యాన 120 మందితో, 7 గ్రామాలలో "పోరుయాత్ర" అర్సవెల్లి, లక్ష్మీతండా, మూడుచెక్కలపల్లి, గోవిందపురం, లైనుతండా, కొండాపురం, ఎర్రచెరువుతండా గ్రామాలలో పర్యటించి 200 నుండి 300 మందితో సభలు నిర్వహించి, భూమి హక్కులు కాపాడుకోవాలని, జీవించే హక్కుకోసం పోరాడాలని వివరించారు. పాలకపార్టీల అగ్రనాయకులు వారి అనుచరులు, అధికార యంత్రాంగం అనేక మార్గాలలో ప్రజలను చీల్చి ప్రజాఆందోళన లేకుండా చేయాలని ప్రయత్నాలు సాగిస్తున్నారు, దశాబ్దాలుగా పోడుకొట్టి సాగుచేసినా ఏ మాత్రం పట్టించుకోని ప్రభుత్వం ప్రజలను గెంటివేసేందుకు వస్తున్నతీరును ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆందోళన సాగుతోంది. ప్రతిపాదిత రంగాయచెరువు ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగా గొలుసుకట్టు చెరువుల నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ నానాటికీ బలపడుతోంది. ✡

# 'లండన్ ఒలంపిక్స్ ప్రాయోజితాన్నుండి డౌ కెమికల్స్ తప్పుకోవాలి'

## భోపాల్ యూనియన్‌కార్బైడ్ బాధితుల డిమాండ్

**లండన్** ఒలంపిక్స్ నిర్వహణకు–అంతర్జాతీయ చమురు దిగ్గజం బ్రిటిష్ పెట్రోలియం; ఖనిజాలు, గనుల బహుళజాతి కార్పొరేషన్ రియోటింటో; మరియు డౌ రసాయన పరిశ్రమ ప్రధాన ప్రాయోజితులుగా వున్నాయి.

1984లో మధ్యప్రదేశ్ రాష్ట్రం–భోపాల్‌లో పదివేల మంది పైగా మరణాలకు, తరాలుగా తరగని బీభత్సానికి కారణమైన యూనియన్ కార్బైడ్ హత్యాకాండ అనంతరం, ప్రజావ్యతిరేకతను దృష్టిలో వుంచుకొని తెలివిగా ఆ పరిశ్రమను తన చేతుల్లోకి తీసుకున్న పరిశ్రమ 'డౌ' అనే విషయం తెలిసిందే.

'ప్రమాదం' పేరిట సాగిన విషరసాయన ప్రయోగ ఫలితంగా నిహతులైన వేలాది కుటుంబాలకు, అంతులేని రోగాల బారిన పడిన వేలాదిమందికి, రెండున్నర దశాబ్దాల అనంతరం ఈనాటికీ అంగవైకల్యంతో జన్మిస్తున్న అభాగ్యులకు బాధ్యుడైన యూనియన్ కార్బైడ్ అధినేత అండర్‌సన్‌ను ప్రజాగ్రహంనుండి గౌరవప్రదంగా ఆనాడే తప్పించి ప్రత్యేక విమానములో వారి మాతృదేశానికి పంపిన ఘనత, 'ఘనత వహించిన మన పాలకులదే'!

జీవచ్ఛవాలుగా ఆనాటినుండీ బతుకులీడుస్తూ నష్టపరిహారానికై అలుపెరగని పోరాటంచేస్తున్నా కనికరించకపోగా, కనికరమే లేకుండా కరకు లాఠీలను బాధితులపై ఉసిగొల్పి రక్తదాహం తీర్చుకున్న ఘటననూ భారత ప్రజానీకం మరిచిపోలేరు.

ఇంతటి 'ఘన చరిత్ర' కలిగిన యూనియన్ కార్బైడ్‌ను టేక్ ఓవర్ చేసిన మరో అమెరికా బహుళజాతి పరిశ్రమ 'డౌ' గతం గతః' అంటూ, గత కాలపు తప్పిదాలకు, నష్టపరిహారాలకు తానేమీ బాధ్యత వహించబోనంటూ సగర్వంగా ప్రకటించినా సాదరంగా స్వాగతించిన 'స్వతంత్ర' పాలకుల సిగ్గుమాలిన తనాన్ని చూసి విస్తుపోవటం ప్రజలవంతైంది.

యూనియన్ కార్బైడ్‌ను చేపట్టిన 'డౌ' నష్ట పరిహారాన్ని చెల్లించే బాధ్యతను తీసుకోకపోవటమే గాక, యూనియన్ కార్బైడ్ పరిశ్రమ స్థలంలోని విషపూరిత వ్యర్థాలను ఈనాటికీ తొలగించకపోవటంతో పరిసరాలన్నీ ఇప్పటికీ కాలుష్యంతో నిండిపోయాయి. భూగర్భంలోకి ఇంకిన కాలుష్యం కారణంగా యూనియన్‌కార్బైడ్ పరిసరాల్లో నివసిస్తున్న బాధితులకు కనీసం మంచినీరు కూడా ఈనాటికీ లభించని దుస్థితి నెదుర్కొంటున్నారు. ఈ నీటి కాలుష్య కారణంగా ప్రజలకు క్యాన్సర్, పుట్టుకతోనే అంగవైకల్యం, ఇతర తీవ్ర జబ్బులు గత 27 సం॥లుగా సంక్రమిస్తూనే ఉన్నాయి. ఈ దారుణంపై రెండున్నర దశాబ్దాలకు స్పందించిన సుప్రింకోర్టులోని ఇద్దరు న్యాయమూర్తులతోకూడిన ధర్మాసనం–ఐదుగురు సభ్యులతో ఒక సాధికార కమిటీని ఏర్పరచి యూనియన్ కార్బైడ్ చుట్టూతా ఉన్న ఆవాసాల్లోని ప్రజలకు మంచినీటిని సరఫరా చేయవలసిందిగా ఆదేశించవలసి రావటం ఎంతటి దౌర్భాగ్యం!

ఇంతటి రక్తసిక్త నేపథ్యమున్న యూనియన్ కార్బైడ్, దాని వారసత్వాన్ని స్వీకరించిన 'డౌ' కంపెనీలు ఒలంపిక్ క్రీడలకు ఆర్థిక ప్రాయోజితాన్ని అందించటం నుండి తప్పుకోవాలని; ఆవిధంగా 'డౌ' కంపెనీ తప్పుకోవాలని భారత ప్రభుత్వం డిమాండ్ చేయాలని; అందుకు నిరాకరిస్తే ఒలంపిక్ క్రీడలలో పాల్గొనటం నుండి భారత ప్రభుత్వం తప్పుకోవటంద్వారా నిరసన తెలియపరచాలని భోపాల్ విషవాయు బాధితులతో గొంతుకలిపిన ప్రజలు, ప్రజాతంత్రవాదులు అత్యంత న్యాయమైన డిమాండ్‌చేస్తూ వస్తున్నారు. తమ తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులందరినీ విషవాయు హత్యాకాండలో కోల్పోయిన భోపాలు విషవాయు బాధితులందరూ 'డౌ' కంపెనీ ప్రాయోజితాన్ని నిరసిస్తూ భారతదేశం లండన్ ఒలంపిక్స్‌ను బహిష్కరించవలసిందిగా పిలుపు నిస్తున్నారు. లండన్ ఒలంపిక్ క్రీడల నిర్వహణాకమిటి అధ్యక్షుడిని స్వయంగా వచ్చి భోపాలు సందర్శించి విషవాయు బాధితుల వేదనను అర్థంచేసుకోవాలని వారు ఆహ్వానించారు.

మన దేశంలోనేకాక, లండన్‌లోనూ, పర్యావరణ హక్కుల సంఘాలన్నీ కలసి 'గ్రీన్‌హౌస్ గోల్డ్–2012' పేరిట ఒలంపిక్స్ నిర్వహణపై నిరసనలు తెలియజేస్తూ 'ప్రాయోజితులలో నీచమైన కార్పొరేటు పరిశ్రమ ఏది' అనే అంశంపై అభిప్రాయసేకరణ చేపట్టాయి. 'డౌ' టేకోవర్ చేసిన యూనియన్ కార్బైడ్ భోపాల్‌గ్యాసు హత్యాకాండగురించి; బ్రిటిష్ పెట్రోలియం సాగిస్తున్న పర్యావరణ విధ్వంసం గురించి; ఒలంపిక్ క్రీడలలో విజేతలకు అందించే పతకాలకు కావలసిన లోహాలను సరఫరాచేసే 'రియోటింటో' కార్పొరేషన్ ప్రజాజీవితాలను కాలుష్య భరితం చేయటాన్ని గురించిన లఘుచిత్రాలను రూపొందించి, ప్రదర్శిస్తూ అభిప్రాయసేకరణ సాగిస్తున్నాయి. ఈ అభిప్రాయ సేకరణలో యూనియన్ కార్బైడ్ వారసత్వాన్ని స్వీకరించిన డౌ కెమికల్స్, ప్రజల, ప్రజాతంత్రవాదుల, పర్యావరణవాదుల ఛీత్కారాలకు గురవటంలో అగ్రస్థానంలో వుంది!

ఏమైనా, సామ్రాజ్యవాదుల సేవలో నిండామునిగి తరిస్తున్న పాలకుల చెవులకు భోపాల్ విషవాయు బాధితుల గోడు అంత తేలికగా సోకుతుందనుకోవటం అత్యాశే అవుతుంది. వారి న్యాయమైన, ప్రజాతంత్ర డిమాండ్‌ను యావన్మంది ప్రజానీకపు డిమాండ్‌గా మలిచి గొంతెత్తటంద్వారానే వారి చెవుల తుప్పువదల గొట్టగలుగుతాము. ✡

## లక్ష్మింపేట దాడులకు నిరసన... (చివరి పేజీ నుండి)



మంగళగిరిలో దిష్టిబొమ్మ దగ్ధం

ఇంకా బలహీనవర్గాల సమాఖ్య అధ్యక్షులు జి. రామకృష్ణ; సుధాకర్, చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పాలకుల దళిత వ్యతిరేక విధానాలను, చర్యలను ఖండించారు.

**పిడుగురాళ్ళ, 21-6-12:**

రైతుకూలీసంఘం (ఆం.ప్ర), ఏఐఎఫ్‌టియు(న్యూ)ల ఆధ్వర్యంలో లక్ష్మింపేట దళితుల హత్యాకాండను నిరసిస్తూ పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. హంతకులను శిక్షించాలని, దళితుల భూమి సమస్య పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు, ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥ ఎన్.రాంబాబు ప్రసంగిస్తూ స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్న ఆరున్నర దశాబ్దాల తర్వాత కూడా లక్ష్మింపేట దళితులపై ఇంతటి క్రూరమైన హంతకదాడులు జరగటమంటే దళితులకు స్వాతంత్ర్యం రాలేదని స్పష్టమౌతున్నదన్నారు. స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ ఎన్.నిర్మల మాట్లాడుతూ లక్ష్మింపేట దళితులపై దాడి మొదటిది కాదు, చివరిదీ కాదని, అగ్రకుల భూస్వామ్య పెత్తందార్ల కాపుగాసే రాజ్యాంగ యంత్రం, పోలీస్, న్యాయ వ్యవస్థలు దళితులపక్షాన నిలవవనీ, దళితులు తమ ఆత్మగౌరవం కోసం, భూమికోసం సంఘటిత పోరాటాలు సాగించాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కా॥ ఎస్.కె.ఖాసిం, సత్యనారాయణ, రాజేశ్వరి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**ఒంగోలు, 21-6-12:**

లక్ష్మింపేట దళితులపై హంతకదాడులను ఖండిస్తూ ప్రకాశం జిల్లా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలులోని ఈమనిపాలెం కార్యాలయం నుండి ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం, చర్చిసెంటర్ మీదుగా కలెక్టర్ కార్యాలయంవరకు ప్రదర్శన జరిపి, కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం హంతకులపై తక్షణ చర్య తీసుకోవాలనే డిమాండ్‌తో కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ యస్.లలిత కుమారి ధర్నాలో ప్రసంగిస్తూ వెనుకబడిన కులాలుగా చెప్పుకుంటున్న తుర్పు కాపులు కుల దురహంకారంతో లక్ష్మింపేట దళితులను గ్రామం నుండి తరిమివేసి, వారు సాగుచేసుకుంటున్న పొలాలను కూడా తామే ఆక్రమించుకోవాలనే కుట్రతో పథకం ప్రకారం సాగించిన దాడిగా పేర్కొని ప్రజలు, ప్రజాతంత్ర వాదులంతా ఈ హత్యాకాండను ఖండించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ వేజండ్ల రామారావు; ఏఐఎఫ్‌టియు(న్యూ) జిల్లా నాయకులు కా॥ ఎం.ఎస్. సాయి, కత్తి పేరయ్య; స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ రేణుక తదితరులు పాల్గొని లక్ష్మింపేట దళితులకు తమ సంఘీభావాన్ని తెలిపారు.

**విజయవాడ, 23-6-12:**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.), ఏఐఎఫ్‌టియు(న్యూ), స్త్రీవిముక్తి సంఘటనల ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంఎదుట లక్ష్మింపేట దళితులకు సంఘీభావంగా ధర్నా నిర్వహించారు. ధర్నాలో తొలుత స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు కా॥సి.విజయ ప్రసంగిస్తూ దళితుల ఆత్మగౌరవ సమస్యతో ముడివున్న భూమి సమస్యను లక్ష్మింపేట దళితులపై దాడి ఘటన ముందుకు తెచ్చిందని, దాడికి ప్రధానకారకులైన బొత్స వాసు నాయుడు తదితరులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు అధ్యక్షత వహించిన రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ ముపాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ లక్ష్మింపేట దాడిలో ఐదుగురు దళితులు హతులైనప్పటికీ, భూమి దక్కేవరకూ పోరాడుతా మనటాన్ని అభినందిస్తూ వారి పోరాటానికి యావన్మంది మద్దతుగా నిలవాలన్నారు. విప్లవ భూ సంస్కరణల ద్వారా 'దున్నే వానికే భూమి' లభించిననాడే దళితులు తలెత్తుకోని సగర్వంగా జీవిస్తారని చెప్పారు.

ఈ శిబిరంలో ఇంకా స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యదర్శి టి. శ్రీదేవి, జిల్లా నాయకులు కా॥ ఎం. కామేశ్వరి; రైతుకూలీసంఘం నాయకులు కా॥ యు. వీరబాబు; ఎన్‌వైయస్ నాయకులు వి.లక్ష్మణరావు, ఓపిడిఆర్ నాయకులు ఎమ్.వెంకట్రావు, ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు కా॥టి.పూర్ణ తదితరులు పాల్గొని దళితులపై హంతకదాడిని ఖండించారు.

**నెల్లూరు, 25-6-12:**

చుండూరు, నీరుకొండ దాడులను మించిపోయిన స్థాయిలో జరిపిన లక్ష్మింపేట దళితులపై హత్యాకాండను ఖండిస్తూ రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం గాంధీబొమ్మ వద్దనుండి అంబేద్కర్‌బొమ్మ, బారకాసు సెంటర్ల మీదుగా కలెక్టరు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి కలెక్టరుకు వినతి పత్రం అందజేసారు.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥జె.కిషోర్‌బాబు ప్రసంగిస్తూ అనవసరమైన ఉప ఎన్నికల గొడవల్లో మునిగిపోయి, దళితులపై దాడి గురించిన వార్తలను మీడియా రాష్ట్రవ్యాపితంగా విస్తృతంగా వెల్లడి చేయలేదన్నారు, భూమి, భుక్తికోసం, ఆత్మగౌరవం కోసం దళిత, పీడిత ప్రజానీకమంతా సమైక్యం కావలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షులు రవీంద్ర, కార్యదర్శి జి.సునీత, కోశాధికారి సుబ్బరాయుడు; స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి కా॥ పి.కొండమ్మ ఇంకా పిడిఎస్‌ఓ, ఎన్‌వైయస్ నాయకులు పాల్గొని నాయకత్వం వహించారు.

**గోపాలపురం, 23-6-12 :**

లక్ష్మింపేట దళితుల ఊచకోతను నిరసిస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.), ఏజన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరిజిల్లా గోపాలపురం మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసిల్‌దారు కార్యాలయం వద్ద 200 మందితో గంటసేపు ధర్నా నిర్వహించారు. ధర్నా సందర్భంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ మాదెపల్లి వెంకటరత్నం; గిరిజన సంఘం కార్యదర్శి మాట్లాడారు. రాష్ట్రంలో దేవాదాయ, బంజరు, పోరంబోకు, భూములన్నింటినీ దళితులకు, అర్హులైన నిరుపేదలందరకీ పంపిణీ చేయాలన్నారు. కులవివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా పేదలంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్ కలుం గంగాదేవి, సవలం రాంబాబు, రైతుకూలీసంఘం నాయకులు సుబ్బారావు, రాజారత్నం తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**మంగళగిరి, 26-6-12:**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.), ఏఐఎఫ్‌టియు(న్యూ)ల ఆధ్వర్యంలో పాతమంగళగిరి హుస్సేన్ కట్టవద్దనుండి అంబేద్కర్ విగ్రహం వరకు, లక్ష్మింపేట దళితులపై హత్యాకాండను ఎలుగెత్తి ఖండిస్తూ-ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా-కులదురహంకారంతో దళితులపై దాడికి తెగబడేందుకు దన్నుగా నిలచి, దళితులకు భూమిపై హక్కును కల్పించకుండా సమస్యను జటిలంచేసి, దళితులకు రక్షణ కల్పించకుండా పోలీస్ పికెట్‌ను ఎత్తివేసిన-ప్రభుత్వం దిష్టిబొమ్మను ఊరేగించి, అంబేద్కర్ విగ్రహంవద్ద దగ్ధం చేసి హంతకులకు కొమ్ముగాసే ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవ సమస్యకు భూమి సమస్యతో విడదీయరాని సంబంధముందన్నారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) జిల్లా నాయకులు కా॥జగ్గారపు సుబ్బారావు మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలంతా భూమి హక్కు కోసం, పోరాడాలని కులాధిపత్యం, దురహంకారానికి వ్యతిరేకంగా ఉద్య మించాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో నవయువ సమాఖ్య, పిడియస్‌ఓ సంఘ కార్యకర్తలు లక్ష్మింపేట దళితులకు సంఘీభావంగా పాల్గొన్నారు.

**మచిలీపట్నం, 23-6-12:**

కాపుకుల దురహంకారుల హంతకదాడిని ఖండిస్తూ స్థానిక కలెక్టర్ కార్యాలయంవద్ద రైతుకూలీసంఘం, ఏఐఎఫ్‌టియు(న్యూ)ల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥యద్దనపూడి సోని మాట్లాడుతూ రాజ్య యంత్రాంగపు దన్నుతో, దళితులను భూములనుండి పారద్రోలేందుకు, పథకం ప్రకారం కాపుపెత్తందార్ల ఆధ్వర్యంలో సాగిన క్రూరమైన దాడిని ఖండిస్తూ దాడులలో మృతులకు జోహార్లర్పించారు.

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకురాలు కా॥పామర్తి అంజమ్మ మాట్లాడుతూ హంతకులకు కొమ్ముగాస్తూ, భూమి సమస్యను పరిష్కరించకుండా వున్న దళిత వ్యతిరేక పాలక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీడితులంతా సంఘటితమై పోరాడాలని, "దున్నేవానికే భూమి" దక్కేంతవరకూ పోరాటాలు సాగాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో చిన్నాపురం నుండి, స్థానిక పేటలనుండి శ్రామిక ప్రజానీకం పాల్గొన్నారు. కామ్రేడ్స్ ముచ్చు సుధాకరరావు, ఉమామహేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొని లక్ష్మింపేట దళితులకు సంఘీభావం ప్రకటించారు.

✡

# పెట్రోల్ ధరల పెంపునకు వ్యతిరేకంగా ఆందోళన



పిడుగురాళ్ళలో రాస్తారోకో

**పిడుగురాళ్ళ, 24-5-12:**

పెట్రోల్ ధరల పెంపుదలను మొత్తంగా వెంటనే కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పిడుగురాళ్ళ మండల కేంద్రంలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర), స్త్రీ విముక్తి సంఘటనల ఆధ్వర్యంలో ప్రదర్శన; నాలుగురోడ్ల కూడలిలో రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఏఐఎఫ్‌టియు, నవయువ సమాఖ్య కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాన్ని తీవ్రంగా నిరసించారు.

**విజయనగరం, 25-5-12 :**

ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో పెట్రోల్‌ధరల తగ్గింపును డిమాండ్ చేస్తూ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి బస్టాండు కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ నియంత్రణ లేని ఆయిల్ కంపెనీలు ఇష్టానుసారంగా పెంచుతున్న పెట్రోల్, డీజిల్ భారం నిత్యావసరాలన్నింటి ధరలనూ పెంచివేస్తున్నదని నినదించారు.

**పిడుగురాళ్ళ, 31-5-12 :**

పదకొండు వామపక్ష పార్టీలు పెట్రోలు ధరల పెంపును నిరసిస్తూ ఇచ్చిన పిలుపు మేరకు పిడుగురాళ్ళలో సిపిఐ (ఎం-ఎల్), సిపిఐ, సిపిఎంల ఆధ్వర్యంలో బంద్ జరిగింది. ఉదయం 6 గంటల నుండే ఆర్‌టిసి డిపో ముందు బైఠాయించి బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. అన్ని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఇతర పార్టీల, ప్రజాసంఘాల నాయకులతోపాటు ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆ.ప్ర.) జిల్లా నాయకులు కా॥ ఎన్. రాంబాబు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ ఎమ్. నిర్మల తదితరులు పాల్గొని ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు.

**విజయనగరం, 31-5-12:**

పెంచిన పెట్రోల్ ధరల తగ్గింపును డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం-ఎల్), సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎం-ఎల్)ఎన్‌డిల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బందు జరిగింది. వర్తక వ్యాపార సంఘాలు బందుకు సహకరించాయి. బందుకు ముందురోజు కరపత్రాలు, పోస్టర్లు, మైకు ద్వారా విస్తృత ప్రచారం చేపట్టటంతో హోటల్స్, సినిమాహాల్స్, గ్యాస్ ఏజన్సీలు, జ్యూటు మిల్లులు మూతబడ్డాయి. ఆటోడ్రైవర్లు పనులు నిలిపివేసి బందులో పాల్గొన్నారు. ఆర్‌టిసిబస్‌ల రాకపోకలు బంద్ అయ్యాయి. బంద్‌లో పాల్గొన్న కొందరు కార్మికులను పోలీసులు అరెస్ట్‌చేసి ఆపై విడుదల చేశారు. ఇతర పార్టీల నాయకులతోపాటు ఈ కార్యక్రమంలో బి. శంకర్రావు సిపిఐ(ఎం-ఎల్), రెడ్డినారాయణరావు (ఏఐఎఫ్‌టియు) ఇతర కార్మిక యూనియన్ల నాయకులు, కార్మికులు చురుగ్గా పాల్గొన్నారు.

✡

# నూతనవేతన ఒప్పందాన్ని డిమాండ్‌చేస్తూ కార్మికుల ప్రదర్శన

**అనకాపల్లి, 21-6-12:**

**క్వారిక్రషర్** యాజమాన్యలు కార్మిక యూనియన్‌లతో కుదుర్చుకున్న పాత ఒప్పందానికి కాలం చెల్లిపోయి 70 రోజులు దాటినా, నూతనవేతన ఒప్పందానికి యాజమాన్యం సిద్ధంకాకపోవటంతో, కార్మికులు ఆందోళనకు సిద్ధమయ్యారు. విశాఖజిల్లా క్వారీ, క్రషర్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు 21-6-12న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గుండాల సెంటర్ నుండి ఆర్‌టిసి కాంప్లెక్స్ దాకా ప్రదర్శన నిర్వహించారు. తమ ప్రధాన డిమాండ్‌ను ఎలుగెత్తి చాటారు.

క్వారీక్రషర్స్, కంప్రెషర్స్‌లో పనిచేస్తున్న క్వారీ కార్మికులకు, డ్రిల్లర్లకు, డ్రైవర్లకు, క్రషర్స్‌లు ఫీడింగ్ లేబర్‌కు, ఆపరేటర్లకు, లోడింగ్‌లేబర్‌కు 50% కూలీ పెంపుచెయ్యాలి; క్వారీల్లో ప్రమాదాల బారినపడి మరణించిన కార్మికుల కుటుంబాలకు 4లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని; పనిలో గాయపడిన కార్మికులకు వారానికి 800రూ॥ భత్యం చెల్లించాలని; క్వారీలలో పాకలు, మంచినీళ్ళు, కనీససౌకర్యం కల్పించాలని; క్వారీ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని; రద్దు ఏరియామహిళా కార్మికుల కూలీని రెట్టింపు చేయాలని; క్రషర్స్ ఫీడింగ్ లేబర్‌కు కనీస వేతనాలివ్వాలని ఈ సందర్భంగా కార్మికులు డిమాండ్ చేశారు.

ప్రదర్శన అనంతరం తహసిల్‌దారు కార్యాలయం వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకుడు కా॥ పి. కోటిరెడ్డి మాట్లాడుతూ నిత్యజీవితావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండగా, కార్మికుల కూలీ రేట్లను పెంచటంలో యాజమాన్యాలు పెద్దఎత్తున లాభాలు గడిస్తూ కూడా మీనమేషాలు లెక్కబెడుతుండటాన్నీ తీవ్రంగా ఖండించారు. కార్మికులంతా ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్‌దారుకు అందజేసి చర్చించగా 28-6-12న క్రషర్ యాజమాన్యాన్ని చర్చలకు పిలిపిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి క్వారీ కార్మికసంఘం అధ్యక్షులు చవితిన వెంకటరమణ, కార్యదర్శి గడి సూర్యరావు, డ్రిల్లర్ల నాయకులు తూరుబిల్లి రమణ, చొప్ప అప్పారావు తదితరులు నాయకత్వం వహించారు.

✡


Read ! Subscribe!!




Organ of
Central Committee of CPI (ML)



జనశక్తి ప్రచురణ
**విప్లవ ప్రజా ఉద్యమం**
**విప్లవ ప్రజా ఉద్యమ సమస్యలు సావధానంగా చర్చిద్దాం!**
**కామ్రేడ్ విశ్వం వ్యాస సంకలనం**
వెల: 10.00
కాపీలకు :
**మైత్రీబుక్‌హౌస్**
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2

## లక్షింపేట... (చివరి పేజీ నుండి)



12-6-2012న మంగళవారం ఉదయం 7-30 గంటలకు లక్షింపేట గ్రామ దళితులపై ఆ గ్రామంలోని కాపు పెత్తందార్లు ఇతర గ్రామాల నుండి తన బంధువర్గాన్ని కూడా సమీకరించుకొని హంతకదాడి చేశారు. కాపు కులపెత్తందార్లు తమ వారినందరినీ పోగేయటం గమనించిన లక్షింపేట గ్రామ సర్పంచి భర్త ఎస్.ఐ.కి ఫోన్‌చేసి చెప్పాడు. మారణాయుధాలతో దళితవాడను చుట్టుముట్టారని కూడా ఫోన్‌చేసి మొరపెట్టుకున్నా పోలీసు అధికారులెవరూ స్పందించలేదు. దళితుల ఇళ్ళల్లోకి దూరిన కాపుకుల అహంకారులు గొడ్డళ్ళు, ఇనుపరాడ్లతో, బరిసెలతో, బాంబులతో దాడిచేసి మూడుగంటల పాటు బీభత్సం సృష్టించారు. కొంత మందిని టార్గెట్ (ఎంచుకొని) చేసుకొని బండరాళ్ళతో కొట్టారు. బరిసెలతో ఒళ్ళంతా తూట్లు పొడిచారు. అడ్డుపెట్టుకున్న వాళ్ళ చేతులు విరగ్గొట్టారు. బొద్దూరి పాపయ్య అనే దళితుణ్ని బరిసెలతో రెండు కళ్ళల్లో పొడిచారు. మహిళలను చెప్పుకోలేని విధంగా ఇనుపరాడ్లతో శరీరమంతా కుళ్ళపొడిచారు. భార్యల ముందే భర్తలను అత్యంత దుర్మార్గంగా హత్యచేసారు. ఈ మారణకాండలో నివర్తి సంగమేశు (40), నివర్తి వెంకట్రావు(60), బూరాడ సుందర్రావు(35), చిత్తిరి అప్పుడు (20)అక్కడికక్కడే మరణించారు. నివర్తి సంగమేశు వంటిపై 42 బరిశ పోట్లున్నాయి. తీవ్రగాయాలతో, రెండు కళ్ళుపోయి, రెండు మూత్రపిండాలు ఛిద్రమై విశాఖలోని కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ వారం రోజుల తరువాత బొద్దూరి పాపయ్య(60) మరణించాడు. ఈ హంతకదాడిలో 5 నిండు ప్రాణాలు పోయాయి. 23 మంది కాళ్ళూ, చేతులు విరిగి విగతజీవుల్లాగా శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పడివున్నారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడి కూడా తమ వారిని కోల్పోయామన్న దుఃఖంతో ఆసుపత్రికి రావడానికి నిరాకరించారు. ఈ హంతకముఠా పసిపిల్లలను కూడా విసిరివేసారు. ఊరికి రెండు కిలోమీటర్ల దూరం నుంచి మట్టికుండతో నీళ్ళు తెచ్చుకోవడానికి వెళ్ళిన సంగమ్మ అనే మహిళపై పదిమంది దాడిచేసి కుండను పగులగొట్టి, చేతిని ముక్కలు ముక్కలు చేశారు. ఇళ్ళల్లో వున్న వస్తువుల్ని నాశనం చేసారు. 'మాల లంజాకొడకల్లారా మీకు భూములు కావాల్రా' అని తిడుతూ, పొడుస్తూ, చంపుతూ మూడు గంటలపాటు ఈ హంతక ముఠా స్వైరవిహారం చేసింది. లక్షింపేట దళితవాడ రక్తపు మడుగులో నిండిపోయింది. ఇంత జరిగాక మధ్యాహ్నం 12.30 గంటలకు పోలీసులు ఆ గ్రామానికి తాపీగా చేరుకున్నారు.

### పథకం ప్రకారం సాగిన హంతకదాడి

వంగర మండలంలోని కాపు పెత్తందారీవర్గం ఈ హంతక దాడికి ముందుగానే పథకం వేసుకున్నారు. 11వ తేదీ రాత్రికే మూడు ఆటోలు, ఒక ట్రాక్టర్‌తో ఇతర గ్రామాల నుండి తమ బంధువులని సమీకరించు కున్నారు. ఈ దాడికి పాల్పడిన వాళ్ళలో కులదురహంకారానికి గురైన స్త్రీలు, పిల్లలుకూడా పాల్గొనటం గమనించాల్సిన విషయం. నరసన్నపేట నియోజకవర్గంలో జరుగుతున్న ఉపఎన్నికల సాకుతో పోలీసులు కూడా తమ పికెట్‌ని ఖాళీచేసి వెళ్ళిపోయారు. కావున కాపుకుల దురహంకార పెత్తందారీవర్గం, అధికార పార్టీ రాజకీయ దన్నుతో, ఆర్థిక అంగబలాలతో, పోలీసుల సంపూర్ణ మద్దతుతో-లక్షింపేట దళితులను ఊరినుండి తరిమికొట్టటానికి వుద్దేశించి సాగించిన క్రూరమైన ఏకపక్ష దాడి ఇది!

కాపు పెత్తందారీవర్గం-లక్షింపేట దళితులకు, తమకు ఎప్పట్నించో ఘర్షణలు సాగుతున్నాయని, ఈ ఘర్షణల్లో భాగమే 12వ తేది సంఘటన అని చిత్రీకరిస్తూ తప్పుడు ప్రచారానికి పూనుకుంది. వివాదాస్పదంగా వున్న భూములపైకి దళితులు వెళ్ళినందువల్లనే ఈ ఘటన జరిగిందని ఒకచోట, దళితులు తమపై పొగ బాంబులు వేశారని మరొకచోట అతినీచమైన ప్రచారానికి కాపు పెత్తందారీవర్గం దిగింది. మీడియా అంతా ఉపఎన్నికల జోరులో మునిగిపోయి ఈ దాడులకు రాష్ట్రస్థాయి ప్రచారం ఇవ్వలేదు.

### దాడికి అసలు కారణాలేమిటి?

శ్రీకాకుళంజిల్లా సువర్ణముఖి-వేగావతి నదీసంగమ ప్రాంతంలో మడ్డువలసవద్ద రిజర్వాయర్ నిర్మాణానికి కొట్టిశ, కొప్పర, దేవకవాడ, నరేంద్రపురం, గుడివాడ, లక్షింపేట గ్రామాలు ముంపుకు గురయ్యేవిగా గుర్తించి రైతులనుండి ప్రభుత్వం షుమారు 3వేల ఎకరాల భూములను 2000 సం॥ ప్రాంతంలో సేకరించింది. ఈ సందర్భంగా భూములు కోల్పోయిన రైతులకు 2.50 లక్షల రూ॥చొప్పున నష్టపరిహారం చెల్లించిన ప్రభుత్వం, దళితులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు అసైన్డ్ భూములనే పేరిట వాటికేవిధమైన పరిహారం చెల్లించకుండానే వారి భూములను గుంజివేసుకుంది. ముంపుకు గురయ్యే గ్రామాల్లో ప్రజల ఇళ్ళకు పరిహారం చెల్లించటంలోనూ దళితులపట్ల వివక్ష చూపారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములలో లక్షింపేట ప్రక్కనే ముంపుకు గురికాని 250 ఎకరాల మిగులు భూమి వుండిపోయింది. ఇది లక్షింపేట కాపులదికాకున్నా, వారే 190 ఎకరాలు సాగుచేసుకుంటున్నారు. లక్షింపేటలోని 80 దళిత కుటుంబాలు (ఒక్కొక్కరు 45



సెంట్ల చొప్పున) 60 ఎకరాలు మాత్రమే సాగుచేసుకుంటున్నారు. లక్షింపేట గ్రామంలో తమ ఇళ్ళప్రక్కనే దళితుల ఇళ్ళుఉండటం, తమతోపాటుగా వారుకూడా సెంటో, కుంటో భూమిని సాగుచేయటాన్ని సహించలేని కాపుకుల దురహంకార పెత్తందారీవర్గం ఏవిధంగానైనా దళితులను ఆ గ్రామం నుండి తరిమివేయాలని కంకణం కట్టుకుంది.

### దళితులపట్ల వివక్ష-వేధింపులు

ఆ జిల్లాకు చెందిన కాపుకులానికి చెందిన బొత్స సత్యనారాయణ రాష్ట్రమంత్రిగా వుండటంతో పాటు రాష్ట్రకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడుగా వున్నాడు. ఆయన భార్య బొత్స ఝాన్సీరాణి ఆ ప్రాంత పార్లమెంటు సభ్యురాలిగా వుండగా, వారి అనుయాయుడు బొత్స వాసుదేవరావు నాయుడు వంగర మాజీ మండలాధ్యక్షుడిగా కొనసాగుతూ రాజకీయ ఆధిపత్యాన్ని నెరపుతూ వస్తున్నాడు.

తమకు కంటగింపుగావున్న దళితులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయకుండా-మొత్తంగా అధికార యంత్రాంగాన్నంతా తమ చేతుల్లో పెట్టుకున్న-బొత్స వర్గీయులు కక్షసాధింపు చర్యలు చేపడ్తూవచ్చారు. గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలుకానీయకుండాను, వృద్ధాప్య తదితర పింఛన్లు; పావలావడ్డీకి రుణాలను అందనీయకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వాధికారులనుండి దళితులకు ఏమాత్రం సహకారం, లేదా సహాయం అందకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూవచ్చారు.

ఈనాటికీ లక్షింపేటలోనూ, పరిసర గ్రామాలలోనూ 'రెండు గ్లాసుల విధానం' అంటరానితనం నిరాటంకంగా కొనసాగిస్తూ వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించవలసిన మధ్యాహ్న భోజనాన్ని దళిత మహిళలు వండుతున్నారని, కాపుకులస్థుల విద్యార్థులందరూ ఆ భోజనం తినడానికి నిరాకరించారు. చివరికి, బొత్స వాసుదేవరావునాయుడిద్వారా కాపుకులస్థుల చేతవండించిన తర్వాతనే మధ్యాహ్న భోజనాన్ని వారు స్వీకరించారంటే అంటరానితనం, కులవివక్ష ఎంతగా ఘనీభవించిందో, అది కూడా వెనుకబడిన కులాలుగా చెప్పుకుంటున్న తూర్పుకాపు కులస్థులలోనూ ఎంతగా కరుడుకట్టిందో స్పష్టమౌతుంది.

ఇక, వంగరనుండి ఎమ్‌ఎల్‌ఏగా ఎన్నికైన దళిత విభాగానికి చెందిన కోండ్రు మురళి మంత్రిగా నున్నప్పటికీ అధికారపార్టీకి దళారీగా వ్యవహరిస్తూ కాపుకుల దురహంకారులకే కొమ్ముగాస్తూ, తన పదవిని కాపాడుకోవటానికే పరిమితమయ్యాడు మినహా లక్షింపేట దళితుల సమస్యను చొరవదీసుకొని పరిష్కరించేందుకు, వారికి అండగా నిలిచేందుకు ప్రయత్నించలేదు-రిజర్వేషన్ ప్రాతిపదికన ఎన్నికైన లక్షింపేట పంచాయితీ దళిత మహిళా సర్పంచ్‌ని పేరుకే ప్రెసిడెంట్‌గా మిగిల్చి, ఆమెను అనేక రూపాల్లో అవమానాలకు గురిచేశారు. పంచాయితీ సమావేశాల్లో సర్పంచ్‌ను వారి ఎదురుగా సమావేశం జరిగినంతసేపూ నిలబెట్టే వుంచారంటే కుల దురహంకారమదం ఎంతగా వీరి కళ్ళ కెగదట్టిందో అర్థంచేసుకునేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలు.

### దళితులపై దాడులు-<br>పోలీసు యంత్రాంగ ప్రేక్షక పాత్ర

2010లోనూ భూములు దున్నుకుంటున్న దళితులపై కాపుపెత్తందార్ల దాడి జరిగింది. దళితులు వంగరస్టేషన్‌లో ఫిర్యాదుచేసినా ఆనాడూ పట్టించు కున్న నాథుడులేడు. చివరికి కోర్టు ఇరుపక్షాలూ ఆ భూములను సాగుచేయరాదని 'భట్టిప్రోలు పంచాయితీ' చేసి చేతులు దులుపుకుంది. దళితులకూ- కాపు పెత్తందారీ వర్గానికి మధ్యవచ్చిన ప్రధాన సమస్య ఇది. దీనితో తమ చేతులోనున్న 190 ఎకరాల భూములను సాగుచేసుకోనీయకుండా దళితులు అడ్డుపడ్డారని ఆరోపిస్తూ కాపుకుల పెత్తందార్లు తమ వారిని మరింతగా దళితులపైకి రెచ్చగొట్టారు.

స్థానిక కాపుకుల పెత్తందార్లు బొత్స వాసుదేవ రావునాయుడు, ఆవుల శ్రీనివాసరావులు దళితులపై భౌతికదాడులకు గత కొంత కాలంగా ఉసిగొలుపుతూ వచ్చారు. రాముడమ్మ అనే దళిత మహిళ పిడకలకోసం పొలాల్లో పేడ పోగేసు కొంటుంటే కులంపేరుతో అసభ్యంగా మాట్లాడుతూ ఆమెపై దాడికి పాల్పడ్డారు. పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు బుట్టదాఖలైంది. 'దళితులను ఊరినుండి తరిమేస్తాం' అని పెత్తందార్లు ఇల్లిల్లూ తిరిగి హెచ్చరికలు చేసిన విషయాన్ని, పోలీసు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ఫలితంలేక పోయింది. దళితుల పిల్లలు ఆడుకుంటుంటే వారి చెప్పులు కాపుకులస్థుల ఇళ్ళముందు పడ్డాయన్న నేరంపై నాల్గవ తరగతి చదువుతున్న నివర్తి రాంబాబును గొడ్డును బాదినట్లు బాదారు. అప్పుడూ పోలీసులు ప్రేక్షక పాత్రే వహించారు. తమని చంపుతామనే బెదిరింపులపై కాపులను నిలదీసిన నివర్తి రావుడమ్మ, కలమటి చిన్నమ్మలను దారుణంగా కొట్టిన సందర్భంలోనూ అధికారపార్టీ రాజకీయుల సేవలో తరించే పోలీసు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయారు. ఈ దెబ్బల తాకిడితో నెలరోజుల తర్వాత నివర్తి రావుడమ్మ చనిపోయింది. ఆపైన కూడా కాపు కులఅహంకారులు చిత్తరి అప్పడుపై దాడిచేసినా పోలీసులు నామమాత్రపు కేసుతో సరిపెట్టారు. ఆనాటినుండి లక్షింపేటలో పోలీస్ పికెట్ కొనసాగుతున్నది. నరసన్నపేట ఉప ఎన్నికల



సాకుతో పోలీసులు ఈ పికెట్‌నూ ఖాళీచేసి వెళ్ళిపోయి క్రూరహత్యాకాండకు పచ్చజెండా వూపారు.

### భూములనొదిలి దళితులు వలసకూలీలుగా వెళ్ళాలని ఉద్దేశించి చేసిన దాడి

విచారకరమైన విషయమేమిటంటే కాపు కుల దురహంకారులు, దాడికి గురైన దళితులు ఇరువురూ కాంగ్రెస్‌కి ఓటువేసి, ఎంఎల్‌ఏను, ఎంపిపిను గెలిపించారు. తమ సమస్యల పరిష్కారంకోసం ఎంపిపిగా వున్న బొత్స వాసుదేవరావునే దళితులు చివరి వరకు నమ్మారు. దాడికి గురయి కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించిన పాపయ్య హంతక దాడికి బాధ్యుడైన బొత్స వాసుదేవరావు వద్ద 20వేల డబ్బు, 2 తులాల బంగారం దాచుకున్నాడు. దాచుకున్న డబ్బు తనకు అవసరాలున్నాయి ఇవ్వమని ఎన్నిసార్లు అడిగినా ఇపుడు నీకెందుకంటూ తిరిగి అతను ఇవ్వటానికి నిరాకరించుతూ వచ్చాడు. బొత్స వాసుదేవరావు తనను నమ్మిన దళితుల్ని భూముల నుండి, గ్రామం నుండి పూర్తిగా తరిమి కొట్టడానికి కుట్రలు పన్నుతూ వచ్చాడు. అధికారంలో వున్న పార్టీ అండతో, ఆర్థిక అండతో, జిల్లా అధికార యంత్రాంగపు అండతో లక్షింపేట దళితులపై ఇంతటి దారుణమైన దాడికి కాపు పెత్తందారీవర్గం తెగబడింది. దళితులకు భూమి అక్కర్లేదు, నివశించడానికి సరైన ఇల్లు అక్కర్లేదంటూ భూమిని, నివాసాలను తమకు వదిలివేసి వలసకూలీలుగా ఊరొదిలిపోవాలని, లేదంటే తమ వద్దనే పాలేర్లుగా పనిచేయాలంటూ చేసిన దాడి ఇది. ఎన్నో వేధింపులను, భౌతికదాడులను భరిస్తూ వస్తున్న దళితులు, పెత్తందారీ వర్గాల దౌష్ట్యాన్ని ఒంటరిగా భరించడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని మానసిక వేదనతో జీవిస్తూవచ్చారు. కాపు పెత్తందారీ వర్గం యొక్క హంతకదాడిని ఊహించలేదు. తమ సామాజిక వర్గానికి చెందిన కోండ్రు మురళి కూడా తమకు ఏ మాత్రం సహకరించకపోగా కాపు పెత్తందారీవర్గం క్రింద అణిగిమణిగి వుండాలి తప్ప భూమి గురించి, ఇతర సమస్యల గురించి ప్రశ్నించ రాదన్న విధంగానే వ్యవహరిస్తూ వచ్చాడు. లక్షింపేట దళితులపై హంతక దాడికి ప్రధాన బాధ్యుడిగా ఒక్కగొంతుతో అందరూ పేర్కొంటున్న బొత్స వాసుదేవరావు నాయుడిని ఎఫ్.ఐ.ఆర్.లో 45వ నిందితునిగా చేర్చటంలోనే కాపు కులదురహంకార పెత్తందార్ల పక్షాన పాలకులు నిస్సిగ్గుగా నిలబడ్డారనే దానికి అద్దంపడ్తున్నది.

### లక్షింపేట దళితులకు అండగా నిలుద్దాం! వారికి భూమిపై హక్కు దక్కేవరకు సమైక్య పోరాటం సాగిద్దాం!

లక్షింపేట దళితులు గత పదేళ్ళుగా తాము సాగుచేసుకుంటున్న ప్రభుత్వభూమి తమకు దక్కాలని అడిగినందుకే ఆరు నిండు ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చింది. ఏవిధమైన ఆస్తులు లేక, కూలి పని చేసుకుని బ్రతుకుతున్న వారి కాళ్ళు, చేతుల్ని కూడా కాపు పెత్తందారీవర్గం విరగ్గొట్టింది. 65 సంవత్సరాలు పూర్తవుతున్న 'ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థ'లో ఇటువంటి దాడులు మన రాష్ట్రంలోనూ, దేశంలోనూ రోజురోజుకీ పునరావృత మవటం అంటే సభ్యసమాజం తలదించుకోవాల్సిన దుస్థితిది! దళితులు ఆత్మగౌరవంతో జీవించడానికి అవసరమైన భూమిహక్కును వాళ్ళకు దక్కనీయకుండా ఇన్నేళ్ళుగా భూస్వామ్య, పెత్తందారీ వర్గం కుట్రలు పన్నుతూనేవుంది. దుర్మార్గమైన దాడులకు పాల్పడుతూనేవుంది.

లక్షింపేట దళితులపై కాపు పెత్తందార్ల హంతక దాడిని ఖండిస్తూ వాడవాడలా ప్రచారం చేద్దాం. లక్ష్మింపేట దళితులకు అండగా నిలబడదాం.

**డిమాండ్స్ :**

- లక్షింపేట దళితులపై హంతకదాడికి పాల్పడిన బొత్స వాసు దేవరావునాయుడు, తదితర కాపు పెత్తందార్లను అరెస్టుచేసి, కఠినంగా శిక్షించాలి.
- లక్షింపేటలోని ప్రతి దళిత కుటుంబానికి భూమిమీద హక్కు కల్పించాలి.
- దాడిలో మరణించినవారి కుటుంబాలకు, గాయపడినవారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- లక్షింపేట దళితులపై దాడిని నివారించలేని జిల్లా ప్రభుత్వ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలి.
- శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు కోలుకునేంతవరకు అన్నిరకాల వైద్య సదుపాయాలు అందించడంతో పాటు వారికి సహాయంగా వున్న వారికి భోజన వసతి కల్పించాలి. ఏడాదిపాటు వారి కుటుంబాలు జీవించడానికి కావలసిన భత్యం ప్రభుత్వం చెల్లించాలి.
- ఉపాధిహామీ పథకం తదితర ప్రభుత్వ పథకాలన్నీ లక్షింపేట దళితులకు అందజేయాలి.

***కారంచేడు, నీరుకొండ,చుండూరు, వేంపెంట, ప్యాపిలి, లక్షింపేట దాడులు పునరావృతం కాకుండా పీడిత ప్రజలంతా భూమికోసం, భుక్తికోసం, ఆత్మగౌరవంకోసం ఐక్యంగా పోరాడుదాం. సమాజాన్ని పట్టి పల్లారుస్తున్న దోపిడీ కులవ్యవస్థ నిర్మూలనకై ఉద్యమిద్దాం. అగ్రకుల దురహంకారానికి వ్యతిరేకంగా, పీడిత ప్రజలందరూ మెరుగైన జీవన ప్రమాణాలతో, ఆత్మగౌరవంతో జీవించేహక్కు కోసం పోరాడుదాం.***



# లక్షింపేట దాడులపై రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్రబృందం పరిశీలనా నివేదిక

# లక్షింపేట దళితులపై కుల దురహంకార పెత్తందార్ల హంతక దాడిని ఖండించండి!

## దాడిచేసిన బొత్స వాసుదేవరావునాయుడు హంతకముఠాని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలి!

*(12-6-12 ఉదయం శ్రీకాకుళంజిల్లా వంగర మండలం లక్షింపేట దళితులపై కాపు కులదురహంకారులు పథకం ప్రకారం ఏకపక్షంగా సాగించిన క్రూరమైన దాడిని ఖండిస్తూ 20-6-12 'జనశక్తి' సంచికలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర) చేసిన ప్రకటనలో కొన్ని పొరపాట్లు దొర్లాయి. పత్రికలలో అప్పటికప్పుడు వచ్చిన అసమగ్ర, అవాస్తవిక సమాచారం ఆధారంగా ఈ ప్రకటన రూపొందిన కారణంగా ఆ పొరపాట్లు చోటుచేసుకున్నాయి. సంఘటనా వివరాలను పేర్కొనే క్రమంలో 'పెత్తందారుల ప్రోద్బలంతో వెనుకబడిన కులాలవారు కొందరు జరిపిన దాడి' అని, 'బిసిలు సాగుచేస్తున్న భూములలో దళితులు వాటా కోరార'ని, 'ఇరువర్గాల మధ్య ఘర్షణలు, కొట్లాటలూ జరుగుతూ వచ్చాయ'ని, 'ఇరువర్గాలూ గాయపడ్డార'ని పేర్కొన్నందుకు చింతిస్తున్నాం.*

*రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥యస్.ఝాన్సి నేతృత్వంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ డి.వర్మ, సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు కా॥తాండ్ర అరుణ, సంఘం విజయనగరం జిల్లా ఉపాధ్యక్షులు కా॥బి.నరసింగరావు, ఏఐఎఫ్టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ఆడారి అప్పారావు సభ్యులుగా ఐదుగురు సభ్యుల బృందం లక్షింపేట దాడిపై వివరమైన పరిశీలన జరిపింది. 19-6-12న లక్షింపేట వెళ్ళిన బృంద సభ్యులు, పెత్తందార్ల దాడిలో మృతులైనవారి కుటుంబాలను కలిసి తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారికి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులై అచేతనంగా శ్రీకాకుళం, విశాఖ ఆసుపత్రులలో పడివున్న బాధితులను, వారి కుటుంబ సభ్యులను కలిసి తమ సహానుభూతిని వ్యక్తంచేసి, వారి న్యాయమైన పోరాటానికి తమ అండదండలుంటాయని సంఘీభావాన్ని ప్రకటించారు. అదేరోజు సాయంత్రం శ్రీకాకుళంజిల్లా రాజాం ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశాన్ని నిర్వహించి లక్షింపేట దళితులపై దాడి, పూర్వాపరాలను వివరించారు. నిర్దిష్టంగా కొన్ని డిమాండ్లను ప్రజల ముందుంచారు. రైతుకూలీసంఘం రాష్ట్రబృందపు పరిశీలనా నివేదికను అందిస్తున్నాం. -రైతుకూలీసంఘం)*

**(నివేదిక పూర్తి పాఠం 7వ పేజీలో)**



పెత్తందార్లు కైవసం చేసుకోజూసిన దళితుల భూములు



కులదురహంకారుల క్రూర హంతక దాడికి సాక్ష్యాలు..

(మరికొన్ని ఫోటోలు 6వ పేజీలో)



లక్షింపేటలో దళితులను పరామర్శిస్తున్న కామ్రేడ్స్ ఝాన్సి, అరుణ

# 'లక్షింపేట దళితులను బలిగొన్న హంతకులను కఠినంగా శిక్షించాలి! దళితుల భూమి సమస్యను తక్షణం పరిష్కరించాలి'

# లక్షింపేట దళితులపై దాడులను ఖండిస్తూ రాష్ట్రవ్యాపిత నిరసన-ఆందోళన

*శ్రీకాకుళంజిల్లా వంగర మండలం లక్షింపేటగ్రామ దళితులపై 12-6-12న కాపు కుల దురహంకార పెత్తందార్లు సాగించిన దారుణ హత్యాకాండను నిరసిస్తూ, హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర), ఏఐఎఫ్టియు(న్యూ), స్త్రీవిముక్తి సంఘటన, నవయువ సమాఖ్యల ఆధ్వర్యంలోనూ, ఇంకా పలు పార్టీల, ప్రజాసంఘాల, దళిత సంఘాల ఆధ్వర్యంలోనూ ప్రదర్శనలు, ధర్నాలు, వివిధ రూపాల్లో ఆందోళనలు రాష్ట్ర వ్యాపితంగా జరిగాయి. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో దళితులపై హత్యాకాండను నిరసిస్తూ కరపత్రం ప్రచురించి, పోస్టర్లు ముద్రించి విస్తృత ప్రచారం చేపట్టటంతో పాటుగా వివిధ ప్రజాసంఘాలతో కలిసి నిరసన కార్యక్రమాలు నిర్వహించింది.*

***-సంపాదకుడు***

**శ్రీకాకుళం:**

లక్షింపేట దళితుల హత్యాకాండపై వెనువెంటనే వెల్లువెత్తిన ఆందోళన నిరసన కార్యక్రమాలన్నింటి లోనూ జిల్లాలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఇతర దళిత, ప్రజాసంఘాలతో కలిసి చురుగ్గా పాల్గొంది. రాష్ట్ర బృందంలో భాగంగా మృతుల కుటుంబాలను పరామర్శించటం లోనూ, క్షతగాత్రులకు ధైర్యాన్ని వ్వటంలోనూ, 20వ తేదీన శ్రీకాకుళంలో జరిగిన నిరసన కార్యక్రమాలలోను రైతుకూలీసంఘం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కా॥ అరుణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ డి.వర్మ ఇతర దళిత, ప్రజాసంఘాలతో కలిసి పాల్గొన్నారు.

24-6-12 తేదీన లక్షింపేటలో జరిగిన మృతవీరుల సంస్మరణ సభకు ఆర్‌పిఐ నేత, హైకోర్టు సీనియర్ న్యాయవాది బొజ్జా తారకం అధ్యక్షత వహించారు. ఈ సభలో దళిత సంఘాలు, కుల నిర్మూలనా సంఘాలతోపాటు పలు పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని లక్షింపేట దళితులకు సంఘీభావం ప్రకటించారు. మృతవీరులకు జోహార్లర్పించారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్. ఝాన్సి ఈ సభలో మాట్లాడుతూ ఆత్మాభిమానంతో దళితులు తలెత్తుకొని జీవించాలంటే భూమి సమస్య పరిష్కారం కావాలని, లక్షింపేట దళితులందరికీ వెనువెంటనే, అక్కడే ప్రభుత్వం సాగు భూమిపై హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

బొజ్జా తారకంగారు మాట్లాడుతూ కారంచేడు, చుండూరు హత్యాకాండను మించిన లక్షింపేట దాడిపై ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు స్పందించలేదని; యస్.పి., కలెక్టర్ వెనువెంటనే సంఘటనా స్థలానికెందుకు రాలేదని నిలదీశారు. దళితులు సాగుచేసుకుంటున్న భూములపై వారికే ప్రభుత్వం హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

**అనంతపురం, 22-6-12:**

ఏఐఎఫ్టియు(న్యూ) రాష్ట్రకమిటి సభ్యులు కా॥ సి.ఆర్.ఖాన్ అధ్యక్షతన స్థానిక తహసిల్‌దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐఎఫ్టియు(న్యూ) నాయకత్వాన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ట్రేడ్ యూనియన్లకు చెందిన కార్మికులు, పేదల కాలనీల ప్రజానీకం వందలాదిగా పాల్గొని లక్షింపేట కాపు కుల దురంహంకారుల దుర్మార్గాన్ని ఎలుగెత్తి ఖండించారు.

ఏఐఎఫ్టియు(న్యూ) రాష్ట్రఅధ్యక్షులు కామ్రేడ్ సి.పెద్దన్న ధర్నాను ప్రారంభిస్తూ లక్షింపేటలో కుల దురహంకారంతో, అధికార రాజకీయ దన్నుతో కాపు పెత్తందారులు పథకం ప్రకారం సాగించిన క్రూరమైన దాడిగా పేర్కొంటూ, అధికార పార్టీ అండదండల కారణంగానే దాడికి కారకులైన వారిని ఈనాటికీ అరెస్ట్ చేయలేదన్నారు. తక్షణం దళితుల భూమి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్త్రీ విముక్తి సంఘటన నగరకమిటి కన్వీనర్ మాట్లాడుతూ లక్షింపేట దళితులకు సంఘీభావంగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. యస్.సి., యస్.టి ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి ఆదినారాయణ దళితులపై అనునిత్యం దేశంలో ఏదో ఓ మూల దాడులు, హత్యాకాండ సాగుతూనేవున్నాయని, కారంచేడులో కమ్మ భూస్వాములు, చుండూరులో రెడ్డి భూస్వాములు, నేడు లక్షింపేటలో కాపు పెత్తందార్లు దాడికి పాల్పడ్డారని భూస్వామ్య అగ్రకుల పెత్తందార్ల దోపిడీ, దాడులకు వ్యతిరేకంగా నిరంతరాయ ఐక్య పోరాటాలు సాగించాలన్నారు.

**(తరువాయి 6వ పేజీలో)**



అనంతపురంలో ధర్నా




విజయవాడలో ధర్నా




ఒంగోలులో ప్రదర్శన




నెల్లూరులో ధర్నా

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010